మీరే చదువరి.. క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.. ప్రపంచవ్యాప్త వార్తలు చదవండి...

PRGI REGD NO: TGTEL/25/A1385

# నేటి ఈవార్తలు

NETI EVARTHALU దినపత్రిక

www.evarthalu.com

మీరే విలేకరి.. క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.. మీ ప్రాంతంలోని వార్తలు పంపండి..

గురువారం THURSDAY 25-6-2026 | జగిత్యాల JAGITIAL | పేజీలు: 12 PAGES:12 | వెల రూ.2.00 PRICE: 2.00
సంపుటి: 1 Volume:1 || సంచిక: 357 Issue: 357

25 జూన్ 2026 - గురువారం శ్రీ పరాభవ నామ సంవత్సరం ఉత్తరాయణం - గ్రీష్మ ఋతువు జ్యేష్ఠ మాసం - శుక్లపక్షం సూర్యోదయం - తె. 5:47 సూర్యాస్తమయం - సా. 6:49 తిథి ఏకాదశి రా. 8:11 వరకు తరువాత ద్వాదశి సంస్కృత వారం బృహస్పతి వాసరః నక్షత్రం స్వాతి సా. 4:24 వరకు తరువాత విశాఖ యోగం శివ ఉ. 10:47 వరకు కరణం వనిజ ఉ. 7:09 వరకు విష్టి రా. 8:11 వరకు వర్జ్యం రా. 10:44 నుండి రా. 12:31 వరకు దుర్ముహూర్తం ఉ. 10:08 నుండి ఉ. 11:00 వరకు మ. 3:21 నుండి సా. 4:13 వరకు రాహుకాలం మ. 1:56 నుండి మ. 3:34 వరకు యమగండం తె. 5:47 నుండి ఉ. 7:25 వరకు గుళికాకాలం ఉ. 9:03 నుండి ఉ. 10:41 వరకు బ్రహ్మముహూర్తం తె. 4:11 నుండి తె. 4:59 వరకు అమృత ఘడియలు ఉ. 6:46 నుండి ఉ. 8:32 వరకు అభిజిత్ ముహూర్తం ఉ. 11:52 నుండి మ. 12:44 వరకు గమనిక: "o" అనగా మరుసటి రోజున

Circulated to Telangana
Published from Jagitial


## పాస్‌పోర్ట్ పౌరసత్వ పత్రం కాదు: కేంద్రం

న్యూఢిల్లీ: భారత పౌరులకు కేంద్ర ప్రభుత్వం అత్యంత కీలకమైన ప్రకటన చేసింది. పాస్‌పోర్ట్ అనేది అంతర్జాతీయ ప్రయాణానికి ఉపయోగపడే డాక్యుమెంట్ మాత్రమేనని, దేశ పౌరసత్వాన్ని నిరూపించే పత్రం కాదని విదేశాంగ శాఖ తెలిపింది. పాస్‌పోర్ట్ సేవా దివస్ సందర్భంగా కేంద్ర ప్రభుత్వం ఈ ప్రకటన చేసింది. పాస్‌పోర్ట్ అనేది విదేశీ ప్రయాణాలను సులభతరం చేసేందుకు మాత్రమే ప్రభుత్వం దీనిని జారీ చేస్తుందని స్పష్టం చేసింది. ఓ వ్యక్తి విదేశాల్లో ఉన్నప్పుడు ఆయన భారతీయ జాతీయుడని తరువాయి 2 వ పేజీలో...




## 'సర్'లో పేరు తీసేస్తే రేషన్ ఇవ్వరా?: సుప్రీం

న్యూఢిల్లీ: ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ నుంచి పేరు తొలగించబడిన వారికి రేషన్ నిరాకరిస్తూ పశ్చిమబెంగాల్ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్‌పై సుప్రీంకోర్టులో బుధవారం విచారణ జరిగింది. ఎస్ఐఆర్‌లో పేరు తీసేస్తే రేషన్ ఇవ్వరా అంటూ సుప్రీంకోర్టు ఆశ్చర్యం వ్యక్తంచేసింది. ఇది రాష్ట్ర పరిధిలోని ప్రత్యేక కారణాలతో కూడిన అంశం కాబట్టి.. ఆర్టికల్ 32 కింద నేరుగా సుప్రీంకోర్టుకు రాకుండా ముందుగా కోల్‌కతా హైకోర్టును ఆశ్రయించాలని సుప్రీంకోర్టు స్పష్టం తరువాయి 2 వ పేజీలో...






## పెండ్లి పత్రికపై పుట్టినతేదీ!

### మహారాష్ట్ర ప్రభుత్వం యోచన

ముంబై: బాల్యవివాహాలను నిరోధించేందుకు పెండ్లి పత్రికలపై వధూవరుల పుట్టిన తేదీలను తప్పనిసరిగా ముద్రించేలా నియమం తీసుకురావాలని మహారాష్ట్ర ప్రభుత్వం యోచిస్తున్నది. బుధవారం శాసనసభలో బీజేపీ సభ్యుడు అతుల్ భత్కల్కర్ అడిగిన ప్రశ్నకు మహిళా, శిశు అభివృద్ధి మంత్రి అదితి తట్కరే సమాధానమిస్తూ పెండ్లి -2 వ పేజీలో...



# ఏరువాకా..? వానెరుకనా

### ఆకాశం మేఘావృతమైనా వానల్లేవ్

**జల్లుల్లేవ్.. విత్తనాలు చల్లుడు లేదు.. అయోమయంలో అన్నదాతలు**

**యంత్రాంగం అప్రమత్తం కావాల్సిందే.. వ్యవసాయ నిపుణుల ఆందోళన**

మరో నాలుగు రోజుల్లో ఏరువాక పౌర్ణమి రాబోతోంది. రైతులు విత్తనాలను సిద్ధం చేసుకుని, భూమిని దున్ని, ఖరీఫ్ పంటలకు శ్రీకారం చుట్టే సమయం. వరి, పత్తి, మొక్కజొన్న, కంది, సోయాబీన్ వంటి పంటల సాగుకు అసలైన టైం. అయితే ఈ ఏడాది ఆకాశం మేఘావృతమవుతున్నా, ఆశించిన స్థాయిలో వర్షాలు కురవడం లేదు. అక్కడక్కడ చిరు జల్లులు పడుతున్నా, వ్యవసాయ పనులకు సరిపడా నీరు అందడం లేదు.

(ఈవార్తలు–స్పెషల్ డెస్క్)

తెలంగాణలో ఇప్పటికే అనేక ప్రాంతాల్లో రైతులు విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేశారు. కొందరు ముందస్తుగా భూమిని సిద్ధం చేశారు. కానీ తగినంత తేమ లేకపోవడంతో విత్తనాలు చల్లేందుకు వెనుకంజ వేస్తున్నారు. ఒకసారి విత్తనం వేసి వర్షం లేకపోతే మొలకలు దెబ్బతింటాయి. తిరిగి విత్తనం కొనాల్సితరువాయి 2 వ పేజీలో...



## ఎరువు.. మాకేం ఎరుక?

### యూరియా బాధ్యత కేంద్రానిదే.. మంత్రి పొన్నం ప్రభాకర్

రైతులకు యూరియా సరఫరా బాధ్యత కేంద్ర ప్రభుత్వానిదే అని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. సకాలంలో ఎరువుల సరఫరా చేయకపోతే బీజేపీ నాయకుల ఇళ్ల ముందు కూర్చుంటామని హెచ్చరించారు. రాష్ట్రంలో బీజేపీ ప్రభుత్వం లేదని, కేంద్రంతో మిత్రపక్షంగా లేమని వివక్ష చూపుతున్నారని పొన్నం పేర్కొన్నారు.

హైదరాబాద్, జూన్ 24 (ఈవార్తలు): గాంధీ భవన్‌లో మాట్లాడుతూ.. 'గతంలో రేషన్ కార్డులు కావాలని వేలాది అప్లికేషన్లు వచ్చాయి.. ఇప్పుడు రేషన్ కార్డు కావాలని ఒక అప్లికేషన్ కూడా రాలేదు.. భూసమస్యలు, కొత్త పెన్షన్‌లపై కొత్త అప్లికేషన్‌లు వస్తున్నాయి. తెలంగాణ ప్రజా పాలన ప్రభుత్వం వచ్చిన తర్వాత అర్హత కలిగిన వారందరికీ రేషన్ కార్డులు ఇచ్చాం. సన్న బియ్యం, 200 యూనిట్లు ఉచిత విద్యుత్ పంపిణీ చేస్తున్నాం.. గ్యాస్ సబ్సిడీ ఇస్తున్నాం, మహిళా సంఘాలకు వడ్డీలేని రుణాలు, నియోజకవర్గానికి 3500 ఇందిరమ్మ ఇళ్లు అందిస్తున్నాం. కొత్త పెన్షన్ పై వినతి పత్రాలు వచ్చాయి.. కొత్తగా 2 లక్షల పెన్షన్లు మంజూరు చేశాం... తరువాయి 2 వ పేజీలో...



## సీఎం రేవంత్‌పై 5 కేసులు కొట్టివేత

తెలంగాణ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డికి ఉన్నత న్యాయస్థానంలో బిగ్ రిలీఫ్ వచ్చింది. గతంలో ఆయనపై నమోదైన కేసుల విషయంలో తెలంగాణ హైకోర్టు బుధవారం రోజున కీలక తీర్పును వెలువరించింది.

హైదరాబాద్, జూన్ 24 (ఈవార్తలు): ఎన్నికల ప్రచార సమయంలో నమోదైన ఏకంగా 5 కేసులను.. సుదీర్ఘ విచారణ తర్వాత వాటన్నింటినీ కొట్టివేస్తూ హైకోర్టు తీర్పును ఇచ్చింది. హైకోర్టు తాజా తీర్పుతో సీఎం రేవంత్ రెడ్డికి చట్టపరంగా ఎదురవుతున్న చిక్కులు తొలిగినట్లు అయింది. 2019లో హుజూరాబాద్ నియోజకవర్గానికి జరిగిన ఉప ఎన్నికల సమయంలో కాంగ్రెస్ -2 వ పేజీలో...

### బంగారం-వెండి ధరలు

బంగారం-వెండి ధరలు (హైదరాబాద్‌లో)

| | |
|---|---|
| (గ్రాము-24 క్యారెట్స్): | రూ.15,137 |
| వెండి (కిలో): | రూ.2,75,000 |
| ప్లాటినం (గ్రాము): | రూ.5,248 |

## 'సర్' అంటే లెక్కలేదా?

### జిడ్డుగా ఉంటే పీకి పడేస్తాం.. కాంగ్రెస్ నేతలకు రేవంత్ అల్టిమేటం



ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియను అత్యంత సీరియస్‌గా తీసుకోవాలని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. హైదరాబాద్‌లో బుధవారం నిర్వహించిన టీపీసీసీ జూమ్ సమావేశంలో రేవంత్‌రెడ్డి.. మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, నియోజకవర్గ ఇన్‌ఛార్జ్‌లతో ఎస్ఐఆర్ ప్రక్రియపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్ఐఆర్ సాధారణ అంశం కాదని, పేద ప్రజల హక్కులతో ముడిపడి ఉన్న కీలక ప్రక్రియ అని పేర్కొన్నారు.

హైదరాబాద్, జూన్ 24 (ఈవార్తలు): ఈ క్రమంలో కొందరి తీరుపై అసహనం వ్యక్తం చేసిన ఆయన.. పని చేయని వారి పేర్లు చెప్పే పరిస్థితి తెచ్చుకోవద్దని, అవసరమైతే వారి స్థానంలో కొత్త ఇన్‌ఛార్జ్‌లను నియమిస్తామని హెచ్చరించారు. కొంతమంది నాయకులు ఎస్ఐఆర్ విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని పీసీసీ మీటింగ్‌లో సీఎం రేవంత్‌రెడ్డి అసంతృప్తి వ్యక్తం చేశారు. జిల్లాల వారీగా అవగాహన కార్యక్రమాలపై తన వద్ద పూర్తి నివేదిక ఉందని, ఎవరు పని చేస్తున్నారు.. ఎవరు చేయడం లేదన్న విషయం తనకు తెలుసని చెప్పారు. పార్టీకి నష్టం జరుగుతుంటే చూస్తూ ఊరుకోబోమని స్పష్టం చేశారు. ఎస్ఐఆర్‌పై కాంగ్రెస్ తరఫున మరిన్ని అవగాహన సదస్సులు తరువాయి 2 వ పేజీలో...



## సారు రావాల్సిందే!


**కేసీఆర్ రావాలని ప్రజలు కోరుకుంటున్నరు**

**రేవంత్ రెగ్యులర్ కాదు.. రెన్యూవల్ సీఎం**

**సత్తుపల్లిలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్**

సత్తుపల్లి, జూన్ 24 (ఈవార్తలు): రేవంత్‌రెడ్డి రెగ్యులర్ సీఎం కాదని.. రెన్యువల్ సీఎం అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సెటైర్లు వేశారు. కేసీఆర్ మళ్లీ అధికారంలోకి రావాలని రాష్ట్ర ప్రజలు కోరుకుంటున్నారని తెలిపారు. కాంగ్రెస్ గెలిస్తే రాష్ట్రం ఆగమవుతుందని కేసీఆర్ అనాడే చెప్పారని అన్నారు. బీఆర్ఎస్ ఓటమితో రాష్ట్రం నష్టపోయిందని చెప్పుకొచ్చారు. సీఎం రేవంత్‌రెడ్డి 72సార్లు ఢిల్లీ వెళ్లి ఏం సాధించారని ప్రశ్నించారు. సత్తుపల్లిలో కేటీఆర్ పర్యటించి, పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. రాష్ట్రంలో ఏవర్గాన్ని వదిలిపెట్టకుండా కాంగ్రెస్ సర్కార్ వేధిస్తోందని ధ్వజమెత్తారు. బుధవారం తరువాయి 2 వ పేజీలో...

### విశ్వవాణి



బ్లడ్ గ్రూప్ కూడా టైప్-2 మధుమేహం వచ్చే అవకాశాన్ని ప్రభావితం చేస్తుందని తాజా పరిశోధన హెచ్చరిస్తోంది. బీ పాజిటివ్ లేదా బీ నెగటివ్ బ్లడ్ గ్రూప్ కలిగినవారిలో ఇతర బ్లడ్ గ్రూపులతో పోలిస్తే టైప్-2 మధుమేహం వచ్చే ప్రమాదం సగటు 28 శాతం ఎక్కువ అని ఉండొచ్చని చైనా పరిశోధకులు తెలిపారు. 51 మెటా-విశ్లేషణలతో కూడిన పరిశోధనలను సమీక్షించి సుమారు 270 ఆరోగ్య సంబంధిత అంశాలను పరిశీలించినట్లు వెల్లడించారు.



## 'మెట్రో' ఆఫీసులు


**57 స్టేషన్లలో కార్యాలయాల ఏర్పాటు.. హైదరాబాద్ మెట్రో సరికొత్త ఆలోచన**

హైదరాబాద్, జూన్ 24 (ఈవార్తలు): హైదరాబాద్ లైఫ్ స్టైల్ విషయంలో మెట్రో రైల్ సంస్థ మరో సరికొత్త మార్పుకు శ్రీకారం చుట్టింది. మెట్రో స్టేషన్లను కేవలం ప్రయాణికుల రాకపోకల కేంద్రాలుగా పరిమితం చేయకుండా.. ఫ్లెక్సిబుల్ వర్క్‌స్పేస్‌లు, కో వర్కింగ్ హబ్‌లు, శాటిలైట్ కార్యాలయాలుగా అభివృద్ధి చేసే దిశగా అడుగులు వేస్తోంది. ట్రాన్సిట్ -2 వ పేజీలో...

## మార్కెట్లకు జోష్!

**790 పాయింట్లు పెరిగిన సెన్సెక్స్**

**24,000 మార్క్‌పైన స్థిరపడ్డ నిఫ్టీ**



దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు బుధవారం భారీ లాభాలతో ముగిశాయి. ముఖ్యంగా ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (ఐటీ), బ్యాంకింగ్, ఫైనాన్షియల్, రియల్టీ రంగాల షేర్లలో బలమైన కొనుగోళ్లు జరగడంతో మార్కెట్లు లాభాల బాట పట్టాయి. ట్రేడింగ్ ముగిసే సమయానికి, సెన్సెక్స్ 790.54 పాయింట్లు లాభపడి 76,991.22 వద్ద స్థిరపడింది.

ముంబై: ఇక నిఫ్టీ 197.55 పాయింట్లు పెరిగి 24,021.65 వద్ద ముగిసింది. ట్రేడింగ్ సెషన్ ఆరంభం నుంచే మార్కెట్లలో సానుకూల సెంటిమెంట్ కనిపించింది. కీలక రంగాల్లో ఇన్వెస్టర్లు షేర్లను కొనుగోలు చేయడంతో సూచీలు మంచి లాభాలను నమోదు చేశాయి. నిఫ్టీలో ఇంటర్‌గ్లోబ్ ఏవియేషన్, అదానీ ఎంటర్‌ప్రైజెస్, ట్రెంట్ షేర్లు అత్యధికంగా లాభపడి టాప్ గెయినర్స్‌గా నిలిచాయి. రంగాల వారీగా చూస్తే, నిఫ్టీ ఐటీ, నిఫ్టీ రియల్టీ సూచీలు 2 శాతానికి పైగా లాభపడి మార్కెట్ ర్యాలీని నడిపించాయి. నిఫ్టీ బ్యాంక్, నిఫ్టీ ప్రైవేట్ బ్యాంక్ సూచీలు కూడా మంచి లాభాలను నమోదు చేశాయి. అయితే, నిఫ్టీ ఆటో, నిఫ్టీ మెటల్ తరువాయి 2 వ పేజీలో...



## ఖమేనీ అంత్యక్రియలకు మోదీకి ఆహ్వానం

**ఐదు రోజుల పాటు సాగనున్న తంతు**

టెహ్రాన్: గత ఫిబ్రవరి 28న అమెరికా, ఇజ్రాయెల్ సంయుక్త దాడుల్లో మరణించిన ఇరాన్ సుప్రీం లీడర్ అయతుల్లా అలీ ఖమేనీ అంత్యక్రియలు జులై 5 నుంచి 9 వరకు జరగనున్నాయి. యుద్ధం కారణంగా పరిస్థితులు అనుకూలించక పలుసార్లు ఖమేనీ తరువాయి 2 వ పేజీలో...

## రాశి ఫలాలు

25.6.2026

మేషం: చేపట్టిన పనులు అంతంత మాత్రంగా సాగుతాయి. సంతాన విద్యా ఉద్యోగ విషయాలు నిరాశ కలిగిస్తాయి. ఆరోగ్య విషయంలో కొంత జాగ్రత్తగా వ్యవహరించాలి. మాతృ వర్గీయులతో మాటపట్టింపులు కలుగుతాయి. దూర ప్రయాణాలు వాయిదా వెయ్యడం మంచిది. వృత్తి వ్యాపారాలు నిదానంగా సాగుతాయి.

వృషభం: ఉద్యోగ వాతావరణం సంతృప్తికరంగా ఉంటుంది. బంధుమిత్రుల నుండి శుభవార్తలు అందుతాయి. అన్ని రంగాల వారికి ఆదాయం బాగుంటుంది. నూతన వస్త్రాభరణాలు కొనుగోలు చేస్తారు. సోదరులతో వివాదాలు పరిష్కారమౌతాయి. వృత్తి వ్యాపారాలు అనుకూలిస్తాయి. నూతన వాహన యోగం ఉన్నది.

మిధునం: ధన విషయమై ఇతరులకు తొందరపడి మాట ఇవ్వడం మంచిది కాదు. ఆదాయానికి మించిన ఖర్చులుంటాయి. కుటుంబ సభ్యుల ప్రవర్తన వలన మానసికంగా స్థిరత్వం ఉండదు. వృత్తి వ్యాపారాలలో సరైన నిర్ణయాలు తీసుకోలేరు. ఆధ్యాత్మిక,సేవా కార్యక్రమాలలో పాల్గొంటారు. నూతన ఋణయత్నాలు కలసిరావు.

కర్కాటకం: ఆర్ధిక పరిస్థితి ఆశించిన రీతిలో ఉంటుంది. వృత్తి వ్యాపారాలలో ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగుతారు. నిరుద్యోగులకు నూతన అవకాశములు అందుతాయి. చేపట్టిన పనులలో అప్రయత్న కార్యసిద్ధి కలుగుతుంది. కుటుంబ వ్యవహారాలలో కీలక ఆలోచనలు అమలు చేస్తారు. ఉద్యోగమున హోదాలు పెరుగుతాయి.

సింహం: వృత్తి వ్యాపారాలలో మీ కష్టానికి తగిన ఫలితం ఉండదు. చేపట్టిన పనులలో జాప్యం కలుగుతుంది. ఆర్థిక వ్యవహారాలు అంతంత మాత్రంగా సాగుతాయి. ఉద్యోగమున అధికారులతో జాగ్రత్తగా వ్యవహరించాలి. ఇంటా బయట కొంతమంది ప్రవర్తన ఆశ్చర్యం కలిగిస్తుంది. ఆధ్యాత్మిక విషయాలపై దృష్టి సారిస్తారు.

కన్య: కుటుంబ సభ్యుల సహాయ సహకారాలతో కొన్ని పనులు సకాలంలో పూర్తి అవుతాయి. ఉద్యోగమున అదనపు బాధ్యతలు ఉన్నప్పటికి నిదానంగా పూర్తిచేస్తారు. ఆర్ధిక పరమైన సమస్యల నుండి ఉపశమనం పొందుతారు. నూతన కార్యక్రమాలు కార్యరూపం దాల్చుతాయి. వ్యాపారాలలో విస్తరణ ప్రయత్నాలు ఫలిస్తాయి.

తుల: ఉద్యోగాలలో నూతన అవకాశాలు లభిస్తాయి. దూర ప్రయాణాలలో నూతన పరిచయాలు కలుగుతాయి. చిన్ననాటి మిత్రులతో గృహమున ఆనందంగా గడుపుతారు. చేపట్టిన పనులలో అవరోధాలు అధిగమించి ముందుకు సాగుతారు. ఆర్ధిక పరమైన ఇబ్బందులను అధిగమించి పాత ఋణాలు తీర్చగలుగుతారు.

వృశ్చికం: సంతాన విషయాలకు సంబంధించి కీలక నిర్ణయాలు అమలు చేస్తారు. కుటుంబ సభ్యులతో ఆధ్యాత్మిక సేవా కార్యక్రమాలలో పాల్గొంటారు. సంఘంలో గౌరవ మర్యాదలు పెరుగుతాయి. వృత్తి ఉద్యోగాలలో నిర్ణయాలు కలసి వస్తాయి. వ్యాపారాలు అనుకూలిస్తాయి. నిరుద్యోగుల ప్రయత్నాలు ఫలిస్తాయి.

ధనస్సు: ఇతరులపై మీ అభిప్రాయం మార్చుకోవడం మంచిది. అనుకున్న సమయానికి అనుకున్న విధంగా పనులు పూర్తికావు. ఇంటా బయట చికాకులు పెరుగుతాయి. శారీరక మానసిక ఆరోగ్య సమస్యలు బాధిస్తాయి. బంధు మిత్రులతో మాటపట్టింపులుంటాయి. వృత్తి ఉద్యోగాలలో మీ కష్టం వృధాగా మిగులుతుంది.

మకరం: గృహమున బంధుమిత్రుల ఆగమనం ఆనందం కలిగిస్తుంది. ఉద్యోగాలలో అప్పగించిన బాధ్యతలను సమర్ధవంతంగా నిర్వహిస్తారు. నూతన వస్తు వాహనాలు కొనుగోలు చేస్తారు. ధనపరంగా చేసే ప్రయత్నాలు అనుకూలిస్తాయి. దూర ప్రయాణ సూచనలున్నవి. వృత్తి వ్యాపారాలలో నూతన లాభాలు అందుకుంటారు.

కుంభం: ముఖ్యమైన వ్యవహారాలలో కుటుంబ పెద్దల సలహాలను తీసుకొని ముందుకు సాగడం మంచిది. సంతాన విద్యా విషయాలలో శుభవార్తలు అందుకుంటారు. ఇంటా బయట మీ మాటకు విలువ పెరుగుతుంది. చేపట్టిన పనులలో ఆటంకాలు కలిగినా నిదానంగా పూర్తిచేస్తారు. ఉద్యోగ వాతావరణం ప్రశాంతంగా ఉంటుంది.

మీనం: దీర్ఘకాలిక అనారోగ్య సమస్యలు బాధిస్తాయి. ఆర్ధిక విషయాలలో తొందరపడి ఇతరులకు మాట ఇవ్వడం మంచిది కాదు. వృత్తి వ్యాపారాలలో శ్రమాధిక్యత పెరుగుతుంది. ప్రారంభించిన పనులు కొంత నిదానంగా పూర్తి చేస్తారు. సహోద్యోగుల ప్రవర్తన వలన మానసిక ఇబ్బందులు తప్పవు. వాహన ప్రయాణాలు వాయిదా వెయ్యడం మంచిది.

# సారు రావాల్సిందే!

మొదటి పేజీ తరువాయి

సత్తుపల్లిలో కార్యకర్తలతో మాట్లాడిన ఆయన.. మున్సిపల్ ఎన్నికల్లో కల్లూరు మున్సిపాల్టీ బీఆర్ఎస్ గెలిచేదని.. సత్తుపల్లిలో కూడా స్వల్ప ఓట్లతో ఈ స్థానం చేజార్చుకున్నామని తెలిపారు. ఆయా ఎన్నికల్లో బీఆర్ఎస్ గెలిస్తే పార్టీ శ్రేణులు పొంగిపోకూడదని.. ఓడితే కృంగిపోకూడదని పేర్కొన్నారు. తెలంగాణ మారుమూల ప్రాంతాలు ఎక్కడకు వెళ్లినా దుర్మార్గపు కాంగ్రెస్ పాలన పోవాలని.. కేసీఆర్ పాలన రావాలని ప్రజలు కోరుకుంటున్నారని తెలిపారు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం సిద్ధించిన తర్వాత కేసీఆర్ హయాంలోని మొదటి పదేళ్లు పునాది రాళ్లు వేసుకున్నామని వివరించారు. కాంగ్రెస్ సర్కారు అన్నదాతలకు రైతుబంధు పూర్తిగా చేయకుండా వేధిస్తోందని ధ్వజమెత్తారు. నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పించడంలోనూ రేవంత్‌రెడ్డి సర్కార్ విఫలమైందని మాజీ మంత్రి కేటీఆర్ ఫైర్ అయ్యారు.

కాంగ్రెస్ పాలనలో ఖమ్మానికి అన్యాయం

'కాంగ్రెస్ వాళ్లు జల యజ్ఞంలో భాగంగా రాజీవ్ సాగర్, ఇందిరా సాగర్ అనే రెండు ప్రాజెక్టులకు రాళ్లు వేసి పోయారు. కానీ చేసింది పెద్దగా ఏం లేదు. కానీ కేసీఆర్ ఎవరో సంబంధం లేని నాయకుల పేర్లు ఎందుకని ఆలోచన చేసి మీ జిల్లా మొత్తం తెలంగాణకు ఆరాధ్య దైవమైన భద్రాద్రి సీతారామ స్వామి వారి పేరు మీద సీతారామ ప్రాజెక్టు అని పెట్టి మన జిల్లాకు 7 లక్షల ఎకరాలకు.. కొత్తగా నాలుగురన్నర లక్షల ఎకరాలకు కొత్త ఆయకట్టు.. ఎన్ఎస్‌పీల కింద కాలువల కింద ఉండే వ్యవసాయాన్ని స్థిరీకరించడానికి 2.50 లక్షల ఎకరాలకు మొత్తంగా 7 లక్షల ఎకరాలకు సాగునీరందించే బృహత్తర యజ్ఞానికి శ్రీకారం చుట్టారు. అందులో మీ సత్తుపల్లిలో 90 వేల ఎకరాల స్థిరీకరణ 40 వేల ఎకరాలు మొత్తం కలిపి లక్షా 30 వేల ఎకరాలు సీతారామ ప్రాజెక్టు పూర్తయితే మొట్టమొదటి ఫలితం అందుకునే నియోజకవర్గం మీ సత్తుపల్లి' అని కేటీఆర్ అన్నారు. ఒకటి రెండు కాదు దాదాపు 10వేల కోట్ల రూపాయలతో ప్రారంభమైంది సీతారామ ప్రాజెక్టు. అందులో 8 వేల కోట్ల రూపాయలు కేసీఆర్ ప్రభుత్వమే ఖర్చు పెట్టింది. అంటే 80 శాతం నిధులు మనం ఇప్పటికే ఖర్చు పెట్టాం. మరి ఈ రెండున్నర సంవత్సరాల్లో కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత జిల్లా మొత్తం కాంగ్రెస్‌కే గెలుపు అందించిన తర్వాత వాళ్లు మనకేం ఇచ్చారు.. ఇవాళ ఖమ్మం జిల్లా రైతులు ఆలోచన చేయాలి. జిల్లా నుంచి ఉపముఖ్యమంత్రి, వ్యవసాయ మంత్రి, రెవెన్యూ మంత్రి.. ముగ్గురు మంత్రులున్నారు. పవర్‌ఫుల్ పోర్ట్‌ఫోలియోల్లో ఉన్నారు.. పవర్ అంతా ఖమ్మం జిల్లాలోనే ఉందట. కానీ ఖమ్మం జిల్లా ప్రజలకు ఏం ఒరిగింది. ఖమ్మం జిల్లా రైతులకు ఏం జరిగింది.. దయచేసి మీరు ఆలోచించాలని కేటీఆర్ విజ్ఞప్తి చేశారు.

# ఏరువాకా.. వానెరుకనా

మొదటి పేజీ తరువాయి

వస్తుంది. అదనపు ఖర్చు భరించలేని చిన్న, సన్నకారు రైతులు ప్రస్తుతం అయోమయంలో ఉన్నారు. ఖరీఫ్ సీజన్‌లో సమయానికి విత్తనాలు వేయడం అత్యంత కీలకం. వర్షాలు ఆలస్యమైతే సాగు విస్తీర్ణం తగ్గే అవకాశం ఉంది. ఆలస్యంగా వేసిన పంటలు ఎదుగుదలలో వెనుకబడటమే కాకుండా, చివరికి దిగుబడి కూడా తగ్గుతుంది. ముఖ్యంగా వరి, పత్తి వంటి పంటలకు ప్రారంభ దశలో తగిన తేమ అవసరం. వ్యవసాయ నిపుణుల అభిప్రాయం ప్రకారం, వర్షపాతం అస్థిరంగా ఉంటే రైతులు స్థానిక పరిస్థితులను బట్టి పంటల ఎంపిక, విత్తనాల వాడకంలో జాగ్రత్తలు తీసుకోవాల్సి ఉంటుంది. ఇప్పటికే సాగు వ్యయం గణనీయంగా పెరిగింది. విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు, కూలీల ఖర్చులు అన్నీ అధికమయ్యాయి. ఈ నేపథ్యంలో వర్షాలు ఆలస్యం కావడం రైతు పెట్టుబడిపై మరింత ఒత్తిడిని పెంచుతోంది. బ్యాంకు రుణాలు, ప్రైవేట్ అప్పులతో వ్యవసాయానికి సిద్ధమైన అనేక మంది రైతులు ఇప్పుడు ఆకాశం వైపు ఆశగా చూస్తున్నారు. సరైన సమయంలో వర్షాలు కురవకపోతే అప్పుల భారం మరింత పెరిగే ప్రమాదం ఉంది. ప్రారంభ వర్షాలు కురవకపోతే చెరువులు, కుంటలు నిండే అవకాశం తగ్గుతుంది. భూగర్భ జలాల రీఛార్జ్ కూడా మందగిస్తుంది. బోర్లపై ఆధారపడే రైతులకు ఇది మరో సవాలుగా మారుతుంది. వర్షాభావం కొనసాగితే తాగునీటి సమస్యలు కూడా తలెత్తే అవకాశముంది. వర్షాలు ఆలస్యం కావడం వల్ల సాగు విస్తీర్ణం తగ్గితే భవిష్యత్తులో వ్యవసాయ ఉత్పత్తుల సరఫరాపైనా ప్రభావం పడవచ్చు. కొన్ని పంటల ఉత్పత్తి తగ్గితే మార్కెట్ ధరల్లో హెచ్చుతగ్గులు చోటుచేసుకునే అవకాశం ఉంటుంది. రైతుకు ధరలు పెరిగినా, దిగుబడి తగ్గితే ఆశించిన లాభం దక్కకపోవచ్చు. వర్షాలు ఆలస్యమయ్యే పరిస్థితుల్లో రైతులకు సరైన సూచనలు అందించడం అవసరం. ప్రత్యామ్నాయ పంటలు, తక్కువ వ్యవధి రకాల విత్తనాలు, నీటి సంరక్షణ పద్ధతులు, పంటల బీమా, అవసరమైన ఇన్‌పుట్ల సరఫరా వంటి అంశాలపై వ్యవసాయ శాఖ చురుకుగా వ్యవహరించాల్సిన అవసరం ఉందని వ్యవసాయ నిపుణులు పేర్కొంటున్నారు.

# మార్కెట్లకు జోష్!

మొదటి పేజీ తరువాయి

సూచీలు నష్టాలతో ముగిశాయి. లాభాల స్వీకరణ కారణంగా ఈ రంగాల్లో అమ్మకాల ఒత్తిడి కనిపించింది. బ్రాడర్ మార్కెట్లలో నిఫ్టీ మిడ్‌క్యాప్ 0.10 శాతం, స్మాల్‌క్యాప్ 0.39 శాతం స్వల్ప లాభాలతో సరిపెట్టుకున్నాయి. టెక్నికల్ నిపుణుల ప్రకారం, నిఫ్టీకి 24,100 స్థాయి వద్ద తక్షణ ప్రతిఘటన ఎదురవుతోంది. దీనిని అధిగమిస్తే బుల్లిష్ ట్రెండ్ కొనసాగి 24,200, ఆపై 24,400 స్థాయిలకు చేరే అవకాశం ఉంది. మరోవైపు, 24,000 మార్క్ తక్షణ మద్దతుగా, 23,900–23,800 జోన్ కీలక సపోర్ట్‌గా పనిచేస్తుందని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.

## పాస్‌పోర్ట్ పౌరసత్వ పత్రం కాదు: కేంద్రం

మొదటి పేజీ తరువాయి

ధ్రువీకరించడానికి ఇది ఉపయోగపడుతుంది తప్ప, అది దేశ పౌరసత్వానికి అంతిమ ఆధారం కాబోదని పేర్కొంది. ఇప్పటికే సుప్రీంకోర్టు కీలక విచారణల సందర్భంగా ఆధార్ కార్డ్ అనేది కేవలం ఒక వ్యక్తి గుర్తింపు పత్రం మాత్రమే కానీ, పౌరసత్వ నిరూపణ పత్రం కాదని స్పష్టం చేసింది. అలాగే ఓటర్ ఐడీ కార్డ్ కూడా కేవలం ఓటు వేయడానికి, నివాస ధ్రువీకరణకు మాత్రమే ఉపయోగపడుతుంది కానీ పౌరసత్వానికి కాదని పేర్కొంది. చట్టాల ప్రకారం.. జనన ధ్రువీకరణ పత్రాలు నిర్దేశిత సంవత్సరాల కంటే ముందు తల్లిదండ్రులు ఇక్కడే నివసించినట్లుగా ఉండే కేంద్ర ప్రభుత్వ అధికారిక పత్రాలే పౌరసత్వాన్ని డిసైడ్ చేస్తాయని విదేశాంగ పేర్కొంది.

## ఖమేనీ అంత్యక్రియలకు మోదీకి ఆహ్వానం

మొదటి పేజీ తరువాయి

అంత్యక్రియలు వాయిదావేశారు. ప్రస్తుతం అమెరికా, ఇరాన్ మధ్య శాంతి ఒప్పందం కుదరడంతో ఉద్రిక్తతలు తగ్గుముఖం పట్టాయి. ఈ నేపథ్యంలో నాలుగు నెలల తర్వాత తమ సుప్రీం నేతకు ఇరాన్ వీడ్కోలు పలికేందుకు సిద్ధమైంది. ఈ నేపథ్యంలో ఖమేనీ అంత్యక్రియలకు హాజరుకావాలని భారత ప్రధాని మోదీని ఇరాన్ ఆహ్వానించింది. ఈ మేరకు ఆ దేశ అధ్యక్షుడు పెజెష్కియాన్ స్వయంగా లేఖ రాశారు. దీనిపై కేంద్రం స్పందన తెలియాల్సి ఉంది.

### అంత్యక్రియలు 5 రోజులు ఎందుకంటే..

ఇస్లాం సంప్రదాయం ప్రకారం సాధారణంగా వ్యక్తి మరణించిన 24 గంటల్లోపు (వీలైనంత త్వరగా) అంత్యక్రియలు పూర్తి చేయాలి. కానీ ఖమేనీ లాంటి అంతర్జాతీయ ప్రభావం ఉన్న నాయకుడి విషయంలో ఐదు రోజులు సమయం తీసుకోవడానికి కారణాలు ఉన్నాయి. దేశవ్యాప్తంగా ఉన్న కోట్లాది మంది, ఇతర నగరాల నుంచి వచ్చే అనుచరులు ఖమఏనీ భౌతికకాయాన్ని కడసారి చూసేందుకు ( ఇస్లాంలో 'జియారత్') వీలుగా వేర్వేరు నగరాల్లో భారీ ఏర్పాట్లు చేయాల్సి ఉంటుంది. ప్రపంచవ్యాప్తంగా ఉన్న వివిధ దేశాలకు చెందిన ప్రధానులు, అధ్యక్షులు, దౌత్యవేత్తలు, ముస్లిం దేశాల ప్రతినిధులు అంత్యక్రియలకు హాజరవ్వడానికి వీలుగా సమయం ఇస్తారు. ఒక దేశ అత్యున్నత నేత మరణించినప్పుడు దేశంలో శాంతిభద్రతల సమస్య రాకుండా చూడటం, తదుపరి వారసుడిని ఎన్నుకునే ప్రక్రియను (ఇరాన్‌లో 'అసెంబ్లీ ఆఫ్ ఎక్స్‌పర్ట్స్') ప్రారంభించడం వంటి అత్యవసర రాజ్యాంగ పనుల కోసం ఈ సమయాన్ని వాడుకుంటారు. ఈ ఐదు రోజుల సంతాప దినాలలో అధికారికంగా, సంప్రదాయబద్ధంగా పలు కార్యక్రమాలు నిర్వహించారు. మొదటి రెండు రోజులు భౌతికకాయాన్ని ప్రత్యేకంగా రసాయనాలతో భద్రపరిచి (ఎంబాల్మింగ్), ఇరాన్‌లోని ప్రముఖ పవిత్ర నగరాలైన కోమ్, మషద్, రాజధాని టెహ్రాన్ వీధుల గుండా భారీ ఊరేగింపుగా తీసుకెళ్తారు. లక్షలాది మంది ప్రజలు వీధుల్లోకి వచ్చి నివాళులర్పిస్తారు. మూడో రోజు కొత్త తాత్కాలిక లేదా తదుపరి అత్యున్నత మత గురువు ఆధ్వర్యంలో టెహ్రాన్ విశ్వవిద్యాలయం లేదా గ్రాండ్ ముసల్లా మైదానంలో అధికారిక అంత్యక్రియల ప్రార్థనలు (జనాజా నమాజ్) నిర్వహిస్తారు.



# ఎరువు.. మాకేం ఎరుక?

త్వరలోనే లబ్ధిదారుల ఎంపిక జరుగుతుంది. హైదరాబాద్‌లో ఇళ్ల కోసం దరఖాస్తులు వచ్చాయి.. కొత్తగా లక్ష ఇళ్లు హైదరాబాద్‌లో నిర్మించడానికి ప్రణాళికలు రూపొందిస్తున్నాం. రాష్ట్రంలో ఏ ప్రజావాణిలో మీ సమస్య పరిష్కారం కాకున్నా.. ఏ కలెక్టర్ దగ్గర మీ సమస్య పరిష్కారం కాకున్నా గాంధీ భవన్‌కు రండి మీ సమస్యలు మేము పరిష్కారం చేస్తామ'ని పొన్నం ప్రభాకర్ తెలిపారు. 'ఇక ఈ నెల 29 నుండి ఏరువాక పౌర్ణమి నుండి వ్యవసాయ కార్యక్రమాలు జరుగుతాయి. విత్తనాల సరఫరా ,ఎరువుల పంపిణీ జరుగుతుంది. భారతదేశంలో రాష్ట్రాలకు ,కేంద్రాలకు వేర్వేరు జాబితాలు ఉండగా కొన్ని ఉమ్మడి అంశాలు ఉన్నాయి. ఎరువులకు సంబంధించి తయారీ, ఉత్పత్తి, సరఫరా కేంద్రం బాధ్యత. రాష్ట్రానికి సరిపడ మొత్తం యూరియా కేంద్రం పంపిణీ చేయాలి. ముడిసరుకు, యూరియా తయారంతా కేంద్రం చూసుకుంటుంది. రాష్ట్రానికి ఎరువులు వచ్చిన రాకపోయినా బీజేపీ నాయకత్వం బాధ్యత వహించాలి. తెలంగాణకు అవసరమైన యూరియా సరఫరా చేయాలని అనేక సార్లు సీఎం, మంత్రులు కేంద్రానికి విజ్ఞప్తి చేశారు. ఎరువులు కేటాయించకపోతే బరాబర్ కేంద్రంతో కొట్లాడుతామ'ని పొన్నం ప్రభాకర్ తేల్చిచెప్పారు.

# పెండ్లి పత్రికపై పుట్టినతేదీ!

మొదటి పేజీ తరువాయి

పత్రికలపై వధూవరుల పుట్టిన తేదీలను ప్రచురించే విధానం ఇప్పటికే రాజస్థాన్‌లో అమల్లో ఉందని, ఆ విధానాన్ని అధ్యయనం చేసేందుకు ఆ ప్రభుత్వానికి లేఖ రాశామన్నారు. ఇటీవలి సర్వేల ప్రకారం మహారాష్ట్రలో బాల్యవివాహాల రేటు తగ్గింది. 2019–21 సర్వేలో 21.9 శాతంగా ఉన్న బాల్య వివాహాల రేటు 2023–24 సర్వే నాటికి 19.6 శాతానికి దిగివచ్చింది.

## సీఎం రేవంత్‌పై 5 కేసులు

# కొట్టివేత

మొదటి పేజీ తరువాయి

పార్టీ తరఫున పీసీసీ చీఫ్‌గా ఉన్న రేవంత్ రెడ్డి .. విస్తృతంగా ప్రచారం చేశారు. ఈ క్రమంలోనే హుజూరాబాద్ ఉపఎన్నికల ప్రచారంలో భాగంగా రేవంత్ రెడ్డి.. నిబంధనలను అతిక్రమించారంటూ రాజకీయ ప్రత్యర్థులు, ప్రభుత్వ అధికారులు ఆయనపై అప్పట్లో పలు ఫిర్యాదులు చేశారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా అనుమతులు లేని చోట సభలను నిర్వహించడం, రోడ్‌షోలు ఏర్పాటు చేయడం వంటి కారణాలతో రేవంత్ రెడ్డిపై పోలీసులు 5 వేర్వేరు కేసులు నమోదు చేశారు. ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘించినందుకు మొత్తంగా రేవంత్ రెడ్డిపై 5 కేసులు నమోదు అయ్యాయి. ఈ 5 కేసులు చాలా కాలంగా పెండింగ్‌లోనే ఉండగా.. సుదీర్ఘంగా విచారణ కొనసాగుతూనే ఉంది. ఈ క్రమంలోనే రాజకీయ కక్షతోనే ఈ కేసులను తనపై పెట్టారని వాదిస్తూ వస్తున్న రేవంత్ రెడ్డి.. ఆ కేసుల నుంచి తనకు రిలీఫ్ ఇవ్వాలంటూ కొన్ని రోజుల క్రితం ఆయన తెలంగాణ హైకోర్టును ఆశ్రయించారు. ఆ 5 కేసులను పూర్తిగా కొట్టివేయాలంటూ రేవంత్ రెడ్డి తరఫున లాయర్లు 5 వేర్వేరు క్వాష్ పిటిషన్లు దాఖలు చేయగా.. భారీ ఊరట లభించింది.

## 'సర్'లో పేరు తీసేస్తే రేషన్ ఇవ్వరా?: సుప్రీం

మొదటి పేజీ తరువాయి

చేసింది. దాంతో పిటిషనర్ తరఫు న్యాయవాది ఎస్ ప్రసన్న తన పిటిషన్‌ను ఉపసంహరించుకుని హైకోర్టుకు వెళ్లేందుకు అనుమతి కోరారు. రేషన్ నిరాకరణ వివాదంపై కోల్‌కతా హైకోర్టును ఆశ్రయించేందుకు పిటిషనర్‌కు స్వేచ్ఛనిస్తూ జస్టిస్ బీవీ నాగరత్న, జస్టిస్ జోయ్‌మాల్యా బాగ్చీలతో కూడిన వెకేషన్ బెంచ్ ఆదేశాలు జారీచేసింది.

## 'సర్' అంటే లెక్కలేదా?

మొదటి పేజీ తరువాయి

నిర్వహించాలని ఆయన సూచించారు. ముఖ్యంగా ఇన్‌ఛార్జ్ మంత్రులు మరింత బాధ్యతాయుతంగా వ్యవహరించాలని ఆదేశించారు. గ్రామ స్థాయిలో సర్పంచ్‌లను కూడా భాగస్వామ్యం చేసి ప్రజల్లో అవగాహన కల్పించాలని సూచించారు. ఎస్ఐఆర్ ప్రక్రియలో పొరపాట్లు జరిగితే పేదల ఓటు హక్కు దెబ్బతినే ప్రమాదం ఉందని రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. ఓటు తొలగిపోతే భవిష్యత్తులో ఆధార్, రేషన్ కార్డులు వంటి సంక్షేమ ప్రయోజనాలపైనా ప్రభావం పడే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. అలాంటి అన్యాయం జరగకుండా పార్టీ నాయకులు అప్రమత్తంగా ఉండాలని కోరారు. పార్టీ ఆదేశాలను ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా పాటించాలని స్పష్టం చేసిన సీఎం రేవంత్.. ఈ విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరించే వారిని క్షమించబోమని హెచ్చరించారు. మరో పది రోజుల సమయం ఇస్తున్నామని, ఈ వ్యవధిలో పనితీరులో స్పష్టమైన మార్పు కనిపించాలని అన్నారు. లేకపోతే చర్యలు తప్పవని సంకేతాలు ఇచ్చారు.

# 'మెట్రో' ఆఫీసులు

మొదటి పేజీ తరువాయి

ఓరియెంటెడ్ డెవలప్‌మెంట్ (టీఓడీ) వ్యూహంలో భాగంగా రూపొందిన ఈ ప్రణాళికకు ఆఫీస్ బబుల్స్‌గా ప్రాధాన్యం పెరుగుతోంది. ఎల్బీ నగర్–మియాపూర్.. నాగోల్–రాయదుర్గం.. జేబీఎస్–ఎంజీబీఎస్ 3 మెట్రో కారిడార్ల పరిధిలోని 57 మెట్రో స్టేషన్లలో కార్యాలయాల ఏర్పాటుకు అనువైన స్థలాలను గుర్తించినట్లు తెలుస్తోంది. ఇప్పటికే జేబీఎస్ మెట్రో స్టేషన్‌లో కోహోర్ట్ కో వర్కింగ్ సెంటర్ కార్యకలాపాలు విజయవంతంగా కొనసాగుతున్నాయి. గోల్డెన్ లైఫ్ ఇన్సూరెన్స్ సంస్థ కూడా ఇదే జేబీఎస్ స్టేషన్‌లో తన ఆఫీసును ఏర్పాటు చేసింది. దీంతో మెట్రో స్టేషన్‌లను వాణిజ్య, ఉపాధి కేంద్రాలుగా మలిచే ప్రక్రియకు శ్రీకారం చుట్టినట్లు అయింది. ఆఫీసులు, వ్యాపార కార్యకలాపాలను.. ప్రజా రవాణా వ్యవస్థతో అనుసంధానించడమే ఈ మోడల్ ప్రధాన లక్ష్యం. హైదరాబాద్‌లోని ఉద్యోగులు తమ నివాస ప్రాంతాలకు సమీపంలో ఉన్న మెట్రో స్టేషన్ వద్దే పనిచేసే అవకాశం కల్పించడం వల్ల.. ట్రాఫిక్ రద్దీలో నగరంలో సుదూర ప్రయాణాలు చేయడం తగ్గనుంది. దీని వల్ల సిటీ రోడ్లపై వాహనాల రద్దీ తగ్గడంతో పాటు మెట్రో వంటి ప్రజారవాణా వినియోగం పెరిగే అవకాశాలు ఉన్నాయి. ఈ ఆఫీస్ బబుల్స్‌లో సంస్థలకు ప్లగ్ అండ్ ప్లే సదుపాయాలు.. నిరంతర విద్యుత్ సరఫరా.. సెక్యూరిటీ, మెరుగైన కనెక్టివిటీ.. ప్రీమియమ్ ఆఫీస్ సౌకర్యాలు అందుబాటులో ఉంటాయి.

# బాల్క సుమన్‌కు బెయిల్

హైదరాబాద్, జూన్ 24 (ఈవార్తలు): సింగరేణి సంస్థ, సింగరేణి యాజమాన్యంపై తీవ్ర వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన కేసులో అరెస్ట్ అయి జైలుకు వెళ్లిన బీఆర్ఎస్ నేత, చెన్నూరు మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ కు ఎట్టకేలకు తెలంగాణ హైకోర్టులో భారీ ఊరట లభించింది. బాల్క సుమన్ తరఫు లాయర్ దాఖలు చేసిన బెయిల్ పిటిషన్‌కు హైకోర్టు ఆమోదం తెలిపింది. ఈ క్రమంలోనే బాల్క సుమన్‌కు షరతులతో కూడిన బెయిల్‌ను ధర్మాసనం మంజూరు చేసింది. హైకోర్టు ఇచ్చిన ఆదేశాల ప్రకారం బాల్క సుమన్‌కు రూ.25 వేల వ్యక్తిగత బాండ్‌తో పాటు.. మరో ఇద్దరు పూచీకత్తు సమర్పించాలని నిబంధనపై బెయిల్ వచ్చింది. గతంలో సింగరేణి సంస్థపై బాల్క సుమన్ చేసిన కొన్ని వ్యాఖ్యలు తీవ్ర దుమారానికి దారితీయడంతో సింగరేణి యాజమాన్యం పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేశారు. ఈ కేసుపై విచారణ జరిపిన హైకోర్టు.. తాజాగా బాల్క సుమన్‌కు షరతులతో కూడిన బెయిల్‌ను మంజూరు చేస్తూ కీలక ఉత్తర్వులు జారీ చేసింది. బీఆర్ఎస్ నేతలతో జరిగిన సమావేశంలో మాట్లాడిన బాల్క సుమన్.. నిరసనలు తెలిపేందుకు కార్మికులు, రైతులు కలిసి రావడం లేదని.. అవసరమైతే బీఆర్ఎస్ కార్యకర్తలు మిలిటెంట్ తరహా దాడులు చేయాలని చేసిన వ్యాఖ్యలు తీవ్ర వివాదాస్పదం అయ్యాయి. కార్మికులు రోడ్ల మీదికి రావాలని.. సింగరేణి సంస్థ ఆఫీస్ కార్యాలయ అద్దాలు ధ్వంసం చేయాలని పిలుపునిచ్చారు. బాల్క సుమన్ చేసిన వివాదాస్పద వ్యాఖ్యలపై రాజకీయ దుమారం రేగింది. బాల్క సుమన్‌పై చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ నేతలు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలోనే బాల్క సుమన్‌పై దేశద్రోహం సహా పలు క్రిమినల్ కేసులు నమోదు చేశారు. బాల్క సుమన్‌ను అరెస్ట్ చేసిన తర్వాత కోర్టు ఆదేశాలతో ఆయనను పోలీసులు చంచల్‌గూడ జైలుకు తరలించారు. గత 25 రోజులుగా జైలులోనే ఉన్న బాల్క సుమన్‌కు తాజాగా బెయిల్ రావడంతో ఆయన బయటికి రానున్నారు. ఈ కేసులో జైలుకు వెళ్లడానికి కొన్ని రోజుల ముందే బాల్క సుమన్ జైలుకు వెళ్లి వచ్చారు. క్యాతన్‌పల్లి మున్సిపాలిటీ ఛైర్మన్, వైస్ ఛైర్మన్ ఎన్నిక సందర్భంగా జరిగిన తీవ్ర వాగ్వాదంలో బాల్క సుమన్.. మంత్రి గడ్డం వివేక్, ఎంపీ గడ్డం వంశీకృష్ణ కాన్వాయ్‌పై దాడి చేసినట్లు ఫిర్యాదులు రాగా.. కేసు నమోదు చేసి జైలుకు పంపించారు.

# రేవంత్ సీఎం కాదు.. స్కామర్!

**కాంగ్రెస్ సర్కారు రూ.1000 కోట్ల స్కాం: జగదీశ్‌రెడ్డి హెచ్చరికలు**

హైదరాబాద్, జూన్ 24 (ఈవార్తలు): కాంగ్రెస్ ప్రభుత్వంపై బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో భాగంగా రాష్ట్రంలో ప్రస్తుతం సాగుతున్న పాలనపై, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య ఉన్న సంబంధాలపై సంచలన వ్యాఖ్యలు చేశారు. తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజలకు అందించాల్సిన సంక్షేమ పథకాలను పక్కనపెట్టి జగదీష్ రెడ్డి ఆరోపించారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వంలో స్కామ్‌లు తప్ప స్కీమ్‌లు లేవని విమర్శించారు. ఈ క్రమంలోనే పీఎం కుసుమ్ పథకంలో దాదాపు రూ.వెయ్యి కోట్ల భారీ కుంభకోణం జరిగిందని జగదీష్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు తెలంగాణ రాజకీయాల్లో తీవ్ర దుమారానికి కారణం అయ్యాయి. ఈ కుంభకోణంలో కొంతమంది పెద్ద నేతల పేర్లు కూడా వినబడుతున్నాయని ఆరోపించారు. ఆ ఆరోపణలపై రాష్ట్ర డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క వెంటనే సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

# నేటి నుంచి టీజీఈఏపీసెట్ వెబ్ ఆప్షన్లు

హైదరాబాద్, జూన్ 24 (ఈవార్తలు): టీజీ ఈఏపీసెట్-2026 ఇంజనీరింగ్ మొదటి విడత కౌన్సెలింగ్‌లో అభ్యర్థులు గురువారం నుంచి జూలై 1వ తేదీ వరకు వెబ్ ఆప్షన్లను నమోదు చేసుకోవచ్చని సాంకేతిక విద్యాశాఖ కమిషనర్, కౌన్సెలింగ్ కన్వీనర్ ఎ. శ్రీదేవసేన ఒక ప్రకటనలో తెలిపారు. ధృవీకరణ పత్రాల పరిశీలనకు జూన్ 29 వరకు అవకాశం కల్పించారు. ఈ ఏడాది కౌన్సెలింగ్ కోసం ఇప్పటివరకు 84,002 మంది అభ్యర్థులు ప్రాసెసింగ్ ఫీజు చెల్లించి స్లాట్ బుక్ చేసుకోగా, వీరిలో 36,393 మంది అభ్యర్థులు ఇప్పటికే సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌కు హాజరయ్యారు. స్లాట్ బుక్ చేసుకున్న వారిలో.. టాప్ 5,000 ర్యాంకుల్లో 2,793 మంది, 5,001 నుండి 20,000 లోపు ర్యాంకులు సాధించిన వారు 11,841 మంది అభ్యర్థులు ఉన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 175 కాలేజీల్లో కౌన్సెలింగ్‌కు అందుబాటులో మొత్తం 1,14,007 సీట్లు ఉండగా, అందులో కన్వీనర్ కోటా కింద 81,620 సీట్లు ఉన్నాయి. విశ్వవిద్యాలయాలు, వాటి పరిధిలోని 22 కాలేజీల్లో మొత్తం 6,046 సీట్లు అందుబాటులో ఉన్నాయి. ఇందులో జేఎన్‌టీయూహెచ్ పరిధిలో అత్యధికంగా 3,150 సీట్లు, ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలో 630 సీట్లు, కాకతీయ యూనివర్సిటీ పరిధిలో 780 సీట్లు ఉన్నాయి. రెండు ప్రైవేట్




విశ్వవిద్యాలయాలలో మొత్తం 1,800 సీట్లు ఉండగా, అందులో 1,260 సీట్లను కన్వీనర్ కోటా కింద భర్తీ చేయనున్నారు. ప్రైవేట్ అన్‌ఎయిడెడ్ కాలేజీలకు సంబంధించి 151 ఇంజనీరింగ్ కాలేజీల్లో మొత్తం 1,06,161 సీట్లు ఉండగా, వాటిలో 74,314 సీట్లు కన్వీనర్ కోటా కింద అందుబాటులో ఉన్నాయి. విద్యార్థుల క్రేజ్‌కు తగ్గట్టుగానే ఈసారి కూడా కంప్యూటర్ సైన్స్, ఐటీ అనుబంధ కోర్సుల్లోనే అత్యధిక సీట్లు ఉన్నాయి. కంప్యూటర్ సైన్స్, ఐటీ అనుబంధ కోర్సులకు సంబంధించి మొత్తం 81,768 సీట్లు అందుబాటులో ఉండగా, అందులో కన్వీనర్ సీట్లు 58,038 ఉన్నాయి. ఇందులో కేవలం సీఎస్ఈ బ్రాంచ్‌లోనే అత్యధికంగా 27,431 కన్వీనర్ సీట్లు ఉండగా, సీఎస్ఈ ఏఐఎంఎల్‌లో 13,537 సీట్లు ఉన్నాయి. ఎలక్ట్రానిక్స్, ఎలక్ట్రికల్ గ్రూపులలో మొత్తం 21,896 సీట్లు ఉండగా.. అందులో కన్వీనర్ సీట్లు 15,795 ఉన్నాయి. ఇందులో ఈసీఈ (జుజజు) లోనే 10,851 సీట్లు ఉన్నాయి. సివిల్, మెకానికల్, తదితర అనుబంధ కోర్సులకు మొత్తం 9,310 సీట్లు ఉంటే, అందులో 6,871 కన్వీనర్ సీట్లు ఉన్నాయి. ఇతర ఇంజనీరింగ్ కోర్సులలో మొత్తం 1,033 సీట్లు ఉండగా, కన్వీనర్ సీట్లు 916 వరకు ఉన్నాయి. వెబ్ ఆప్షన్లు ఇచ్చే సమయంలో విద్యార్థులు తమ లాగిన్ ఐడీ, పాస్‌వర్డ్, ఓటీపీ, మొబైల్ నంబర్ వివరాలను ఎవరికీ చెప్పకూడదని కన్వీనర్ సూచించారు. మొదటి విడతలోనే మంచి కాలేజీలో సీటు సాధించడానికి అభ్యర్థులు వీలైనన్ని ఎక్కువ ఆప్షన్లను ఎంచుకోవాలని కోరారు. ఆన్‌లైన్‌లో ఆప్షన్లు నమోదు చేసే ముందు, అభ్యర్థులు 'మాన్యువల్ ఆప్షన్స్ ఎంట్రీ ఫామ్' పూర్తి చేసుకుని కాలేజ్ కోడ్, బ్రాంచ్ కోడ్‌లను సిద్ధంగా ఉంచుకోవాలని తెలిపారు. అధికారిక వెబ్‌సైట్ ట్రిజూం:7/స్రముజూ.ఎవ్.అఅఎ.అఅ లో కాలేజీల ప్రొఫైల్‌ను సరిచూసుకుని, ఆప్షన్లను ప్రాధాన్యత క్రమంలో అమర్చుకోవాలని విద్యార్థులకు సూచించారు.

# బాస్ స్కాం.. భద్రం బాసూ!

**తెలంగాణ సైబర్ బ్యూరో హెచ్చరిక**

హైదరాబాద్, జూన్ 24 (ఈవార్తలు): రాష్ట్రంలో 'బాస్ స్కామ్' లేదా 'సీఈవో ఇంపర్సొనేషన్ ఫ్రాడ్' పేరుతో సరికొత్త సైబర్ మోసాలు పెరుగుతున్నాయని తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో (టీజీసీఎస్‌బీ) హెచ్చరికలు జారీ చేసింది. ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థలు, వ్యాపార యజమానులు, పౌరులు అప్రమత్తంగా ఉండాలని సూచించింది. ఈ మేరకు టీజీసీఎస్‌బీ డైరెక్టర్ శిఖా గోయల్ బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఇండియన్ సైబర్ క్రైమ్ కోఆర్డినేషన్ సెంటర్ జారీ చేసిన సూచనల ప్రకారం, సైబర్ నేరగాళ్లు ఉన్నతాధికారులు, వ్యాపార యజమానులను లక్ష్యంగా చేసుకుని ఈ మోసాలకు పాల్పడుతున్నారని శిఖా గోయల్ తెలిపారు. అత్యవసర పనుల పేరుతో ఈమెయిల్, వాట్సాప్ ద్వారా మాల్‌వేర్ ఉన్న ఫైల్స్ పంపిస్తున్నారని వివరించారు. దేశవ్యాప్తంగా కేవలం 20 రోజుల వ్యవధిలోనే ఇలాంటి మోసాలకు సంబంధించి 300కు పైగా ఫిర్యాదులు నమోదయ్యాయని, ఇది పరిస్థితి తీవ్రతను తెలియజేస్తోందని ఆమె పేర్కొన్నారు. మోసగాళ్లు జిప్/రార్ ఫైల్స్‌ను అత్యవసర డాక్యుమెంట్లుగా పంపిస్తారని, వాటిని ఓపెన్ చేయగానే బాధితుల ఫోన్ లేదా కంప్యూటర్‌లో మాల్‌వేర్ ఇన్‌స్టాల్ అవుతుందని ఆమె వివరించారు. దీని ద్వారా వాట్సాప్ వెబ్ సెషన్‌లు, ఇతర సమాచారాన్ని దొంగిలించి, బాధితుల పైఅధికారిలా నటిస్తూ ఉద్యోగులకు, ఆర్థిక వ్యవహారాలు చూసే సిబ్బందికి సందేశాలు పంపుతారు. అత్యవసరంగా రహస్య సమాచారం ఇవ్వాలని ఒత్తిడి చేస్తారు. అనుమానాస్పద ఫైల్స్, 'అత్యవసరంగా స్పందించాలి' వంటి సందేశాలను నమ్మవద్దని అధికారులు సూచిస్తున్నారు.

# రూ.1000 కోట్ల స్థలాన్ని కాపాడిన హైడ్రా

హైదరాబాద్, జూన్ 24 (ఈవార్తలు): హైదరాబాద్ శివార్లలోని ఐటీ కారిడార్‌లో భారీ కబ్జా యత్నాన్ని హైడ్రా (హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్ ప్రొటెక్షన్ ఏజెన్సీ) భగ్నం చేసింది. శేరిలింగంపల్లి మండలం ఖానామెట్‌లో దాదాపు రూ.1,000 కోట్ల విలువైన ఐదెకరాల ప్రభుత్వ భూమిని అక్రమార్కుల చెర నుంచి విడిపించింది. ఈ స్థలంలో నిర్మించిన తాత్కాలిక షెడ్లు, గదిని కూల్చివేసి, భూమి చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేసింది. మెటల్ చార్మినార్ నుంచి హైటెక్స్ ఎగ్జిబిషన్ సెంటర్‌కు వెళ్లే దారిలో ఉన్న సర్వే నంబర్ 42లోని ఈ విలువైన భూమిని కొందరు కబ్జా చేసేందుకు ప్రయత్నించారు. చుట్టూ రేకులతో ఫెన్సింగ్ వేస్తుండగా రెవెన్యూ శాఖ అధికారులు హైడ్రాకు ఫిర్యాదు చేశారు. దీంతో రంగంలోకి దిగిన హైడ్రా సిబ్బంది, అక్రమ నిర్మాణాలను తొలగించి, ఇది ప్రభుత్వ భూమి అని సూచిస్తూ బోర్డులను ఏర్పాటు చేసింది. మరోవైపు, రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్‌మెట్ మండలం మర్రిపల్లి గ్రామంలోని చెరువు కబ్జాను కూడా హైడ్రా అడ్డుకుంది. పట్టా భూమిలో ఆర్ఎంసీ యూనిట్ ఏర్పాటు చేసిన ఓ వ్యక్తి, వ్యర్థాలను చెరువులోకి డంప్ చేస్తూ సుమారు ఐదెకరాల చెరువు భూమిని ఆక్రమించేందుకు ప్రయత్నించాడు.

## మీరిచ్చే ప్రతి పైసా.. ప్రజాస్వామ్య పరిరక్షణకే!

ఉన్నది ఉన్నట్లు చెప్పే తత్వం..
ఎవరికీ కొమ్ముకాయని పథం..
ప్రజా సమస్యలపై యుద్ధం..
ప్రజా హితమే మా శపథం..
ప్రజాపోరులో మేము సంసిద్ధం..
ఇదే నేటి 'ఈవార్తలు' నైజం!

*అక్షరమే అస్త్రంగా, ప్రభుత్వాన్ని సరైన దారిలో నడిపించే శస్త్రంగా, వార్తలను నిక్కచ్చిగా అందిస్తూ సాగుతున్న అలుపెరుగని ప్రయాణం మాది. పాలకుల తప్పులను ఎండగడుతూ, వ్యవస్థలను గాడిలో పెట్టే శక్తిమంతమైన శస్త్రం నేటి 'ఈవార్తలు'. ఎవరికీ తలొగ్గని కలం, న్యాయం కోసం గొంతెత్తే గళం.. మన పత్రిక. నిష్పక్షపాత జర్నలిజం మనుగడ సాగించాలంటే అది ప్రజాబలంతోనే సాధ్యం. మీరు అందించే ప్రతి పైసా ఆర్థిక దన్ను మాత్రమే కాదు, అక్రమాలపై మేము ఎక్కుపెట్టే అస్త్రానికి పదును. ప్రజాసమస్యలపై రాజీలేని పోరాటానికి, నిజాలను నిర్భయంగా చాటిచెప్పడానికి మాతో చేయి కలపండి. సత్యాన్వేషణలో భాగస్వాములుకండి.. ప్రజాస్వామ్య పరిరక్షణలో తోడుగా నిలవండి.*

- శ్రావణ్ కుమార్ బొమ్మకంటి, ఎడిటర్

సందేహాలకు 94404 55811 నంబర్‌ను సంప్రదించవచ్చు.



## కోల్‌కతాలో 5 గురు సమాధి

**కుప్పకూలిన గోదాం.. శిథిలాల కింద 40 మంది**

**20 మందిని కాపాడిన రెస్క్యూ సిబ్బంది**

కోల్‌కతా: కోల్‌కతాలోని తారాతలా ఏరియాలో భారీ అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. దాంతో నిర్మాణంలో ఉన్న మూడంతస్తుల గోదాం కుప్పకూలింది. ఈ ప్రమాదంలో ముగ్గురు కార్మికులు మృతిచెందారు. శిథిలాల కింద మరో 40 మందికిపైగా చిక్కుకున్నారు. ఈ 40 మందిలో ఇప్పటివరకు 10 మందిని రెస్క్యూ టీమ్స్ రక్షించాయి. మిగతా 30 మందిని రక్షించేందుకు సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. గోదాం నిర్మాణంలో భారీ ఇనుప స్తంభాలు వాడటంతో సహాయక చర్యలు ఆటంకం ఏర్పడుతుందని నిపుణులు అంటున్నారు. అంతకుముందు ప్రమాదం జరగగానే స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. దాంతో పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది కలిసి హుటాహుటిన ఘటనా ప్రాంతానికి చేరుకున్నారు.

## ట్రంప్.. నువ్వు తప్పు!

**ఇరాన్‌పై సైనిక చర్యలకు అమెరికా సెనేట్ బ్రేక్**

వాషింగ్టన్: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కు మరో బిగ్ షాక్ తగిలింది. ఇరాన్‌తో సాగిస్తున్న సైనిక వైఖరికి యూఎస్ కాంగ్రెస్‌లో గట్టి ఎదురుదెబ్బ తగిలింది. ఇరాన్‌పై అధ్యక్షుడి ఏకపక్ష యుద్ధ అధికారాలకు కళ్లెం వేస్తూ అమెరికా ఎగువ సభ (సెనేట్) 'వార్ పవర్స్ రిజల్యూషన్'కు ఆమోదం తెలిపింది. మొత్తం 100 మంది సభ్యులున్న సెనేట్‌లో ఈ తీర్మానానికి అనుకూలంగా 50 ఓట్లు, వ్యతిరేకంగా 48 ఓట్లు వచ్చాయి. సెనేట్‌లో ట్రంప్‌కు చెందిన రిపబ్లికన్ పార్టీకే మెజారిటీ ఉన్నప్పటికీ, నలుగురు రిపబ్లికన్ సెనేటర్లు పార్టీ లైన్‌ను దాటి ప్రతిపక్ష డెమొక్రాట్లతో కలిసి ఈ తీర్మానానికి అనుకూలంగా ఓటు వేయడం గమనార్హం. ఇప్పటికే ఈ బిల్లు దిగువ సభలో నెగ్గగా, ఇప్పుడు సెనేట్ కూడా ఆమోదించడంతో కాంగ్రెస్ అనుమతి లేకుండా ట్రంప్ ఇరాన్‌పై ఏకపక్షంగా సైనిక దాడులను కొనసాగించడానికి వీల్లేదని స్పష్టమైంది. అమెరికా, ఇరాన్ దేశాల మధ్య స్విట్జర్లాండ్‌లో యుద్ధాన్ని ముగించేందుకు కీలకమైన శాంతి చర్చలు జరుగుతున్న తరుణంలో ఈ పరిణామం చోటు చేసుకుంది. ఈ సంయుక్త తీర్మానం నేరుగా చట్టబద్ధంగా అమలు కానున్నందున, దీనిని అధ్యక్షుడు ట్రంప్ వీటో చేసే అవకాశం కూడా లేదు. ఈ ఓటింగ్ ఫలితంపై డెమొక్రాట్ నేత చక్ షుమర్ స్పందిస్తూ, ట్రంప్ ఇరాన్ విషయంలో చారిత్రాత్మక తప్పిదం చేశారని విమర్శించారు. అయితే, ఈ తీర్మానంపై ట్రంప్ తీవ్రంగా మండిపడ్డారు. తాము ఇరాన్‌తో యుద్ధాన్ని శాశ్వతంగా ముగించేందుకు తుది చర్చలు జరుపుతున్న తుల్యమైన సమయంలో, ఇలాంటి తీర్మానాలు చేయడం దేశద్రోహంతో సమానమని, డెమొక్రాట్లు కేవలం రాజకీయ కక్షతోనే దేశ ప్రయోజనాలను పక్కనబెడుతున్నారని ఆయన విమర్శించారు.

## చల్లారిన చమురు.. బంగారం రేటు తరుగు!

న్యూఢిల్లీ: పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు కాస్త చల్లారడంతో అంతర్జాతీయ మార్కెట్‌లో సానుకూల పవనాలు వీస్తున్నాయి. దీని ప్రభావంతో దేశీయంగా బంగారం, వెండి ధరలు భారీగా తగ్గుముఖం పట్టాయి. మరోవైపు ముడి చమురు ధరలు సైతం నాలుగు నెలల కనిష్టానికి పడిపోయాయి. 10 గ్రాముల 24 క్యారెట్ల (మేలిమి) బంగారంపై సుమారు రూ.2,000 వరకు తగ్గింది. దీంతో హైదరాబాద్ మార్కెట్‌లో తులం పసిడి ధర రూ.1,47,100కు చేరింది. 22 క్యారెట్ల బంగారం ధర రూ.1.33 లక్షల వద్ద ఉంది. కిలో వెండిపై ఒకే రోజు ఏకంగా రూ.10 వేల వరకు క్షీణించి, ప్రస్తుతం రూ.2.30 లక్షల వద్ద ట్రేడ్ అవుతోంది. జాతీయ మీడియా సమాచారం ప్రకారం.. అమెరికా ఫెడ్ వడ్డీ రేట్లు పెంచుతుందన్న సంకేతాలతో డాలర్ ఇండెక్స్ బలపడింది. అమెరికా బాండ్లపై రాబడులు పెరుగుతుండటంతో మదుపర్లు బంగారం, వెండిలో పెట్టుబడులు ఉపసంహరించుకుంటున్నారు. చైనాలో వెండి వినియోగం భారీగా తగ్గడం కూడా ధరల పతనానికి దారితీసింది. అంతర్జాతీయంగా బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర నాలుగు నెలల కనిష్టానికి (76.54 డాలర్లకు) పడిపోయింది. ఇరాన్ చమురుపై అమెరికా ఆంక్షల సడలింపులు, హర్మూజ్ జలసంధి ద్వారా నౌకల రాకపోకలు తిరిగి ప్రారంభం కావడంతో మార్కెట్‌లో చమురు లభ్యత పెరిగింది. ముడి చమురు ధరల పతనం భారత ఆర్థిక వ్యవస్థకు, రూపాయి బలోపేతానికి సానుకూల అంశమే అయినప్పటికీ.. సామాన్యులకు తక్షణమే పెట్రోల్, డీజిల్ ధరల తగ్గింపు రూపంలో ఊరట లభించే అవకాశం లేదని మార్కెట్ నిపుణులు అంచనా వేస్తున్నారు. రిటైల్ మార్కెట్‌లో ఇంధన ధరల తగ్గింపు కోసం మరికొంత కాలం వేచిచూడక తప్పదు.

## ఇప్పటికిప్పుడు వడ్డీ రేట్లు పెంచం: ఆర్బీఐ

న్యూఢిల్లీ: వడ్డీ రేట్ల పెంపుపై ఆర్బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా కీలక వ్యాఖ్యలు చేశారు. దేశంలో ప్రస్తుతం వడ్డీ రేట్ల పెంపుపై తక్షణ నిర్ణయం తీసుకునే ఆలోచన లేదని స్పష్టం చేశారు. తాజాగా ఓ జాతీయ పత్రికకు ఇచ్చిన ఇంటర్వ్యూలో మాట్లాడిన ఆయన.. ఆర్థిక వ్యవస్థలో పెరుగుతున్న చమురు ధరల ప్రభావం, ద్రవ్యోల్బణ పరిస్థితులను ఆర్‌బీఐ నిశితంగా గమనిస్తోందని ఇటువంటి పరిస్థితుల్లో వడ్డీ రేట్ల పెంపుపై మాట్లాడటం తొందరపాటే అవుతుందన్నారు. ఈ మేరకు మార్కెట్‌లో వడ్డీ రేట్ల పెంపుపై జరుగుతున్న ప్రచారానికి ఆయన తెరదించారు. ఒకవేళ మేము మార్కెట్‌ను వడ్డీ రేట్ల పెంపునకు సిద్ధం చేయాలనుకుంటే.. మా ద్రవ్య విధాన వైఖరిని న్యూట్రల్ నుండి రెస్ట్రిక్టివ్‌గా మార్చేవాళ్లమని వివరించారు. వడ్డీ రేట్లపై ఎంపీసీ కమిటీ ప్రతి సమావేశంలోనూ పరిస్థితులను సమీక్షించి నిర్ణయం తీసుకుంటుందని చెప్పారు. కరెన్సీ మార్కెట్, అంతర్జాతీయ అస్థిరతపై అందరిలోనూ ఆందోళన ఉందని.. అయితే పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు తగ్గడం ఒక పెద్ద సానుకూల అంశమని ఆయన అన్నారు. రూపాయికి మద్దతుగా ఆర్‌బీఐ తీసుకున్న చర్యలకు మంచి స్పందన లభించిందని చెప్పారు. విదేశీ నిధుల ప్రవాహం మరింత ఆరోగ్యకరంగా ఉంటుందని ఆశిస్తున్నట్లు తెలిపారు. స్పెక్యులేషన్‌ను అరికట్టడానికి తీసుకున్న చర్యల వల్ల ఫారెక్స్ మార్కెట్‌లో కదలికలు క్రమబద్ధంగా ఉన్నాయని తెలిపారు. భారతీయ బాండ్లను బ్లూమ్‌బెర్గ్ లేదా ఇతర గ్లోబల్ ఇండెక్స్‌లలో చేర్చితే అది దేశ ఆర్థిక వ్యవస్థకు ఎంతో మంచిదని అభిప్రాయపడ్డారు. ప్రస్తుతం ఆర్‌బీఐ వద్ద ఉన్న విదేశీ మారక నిల్వలు దేశానికి పూర్తి భద్రతను ఇస్తున్నాయని గవర్నర్ మల్హోత్రా ధీమా వ్యక్తం చేశారు. మన ఫారెక్స్ రిజర్వ్ వ్యూహం అనేది ముఖ్యంగా భద్రత, లిక్విడిటీ (ద్రవ్య లభ్యత), మరియు రాబడి అనే సూత్రాలపై ఆధారపడి నిర్మించబడిందని తెలిపారు. ఫారెక్స్ నిల్వలలో భాగంగా ఉన్న బంగారం నిల్వలు కూడా అవసరమైనప్పుడు భద్రత, లిక్విడిటీని అందించడమే లక్ష్యంగా పెట్టుకున్నామని ఆర్‌బీఐ గవర్నర్ వివరించారు.

## సువేందు సూపర్

**పొగిడిన మహువా మొయిత్రా.. మమతా బెనర్జీకి మరో షాక్**

కోల్‌కతా: పశ్చిమ బెంగాల్ రాజకీయాల్లో మరోసారి ప్రకంపనలు మొదలయ్యాయి. తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ) ఎంపీ మహువా మొయిత్రా, రాష్ట్ర ముఖ్యమంత్రి, బీజేపీ నేత సువేందు అధికారిపై ప్రశంసలు కురిపించడం ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది. ఆయనతో తనకు ఉన్న వ్యక్తిగత అనుబంధాన్ని ఆమె గుర్తు చేసుకున్నారు. పార్టీలో తిరుగుబాటు, ఎన్నికల్లో ఓటమితో టీఎంసీ తీవ్ర సంక్షోభంలో ఉన్న తరుణంలో మహువా చేసిన ఈ వ్యాఖ్యలు రాజకీయ ప్రాధాన్యతను సంతరించుకున్నాయి. బీబీసీకి ఇచ్చిన ఇంటర్వ్యూలో మహువా మొయిత్రా మాట్లాడుతూ, "సువేందు అధికారితో నాకు వ్యక్తిగతంగా మంచి సంబంధాలు ఉన్నాయి. మేమిద్దరం టీఎంసీలో ఉన్నప్పుడు ఆయన నాకు ఎంతో మద్దతుగా నిలిచారు. ఒక రకంగా చెప్పాలంటే మా మధ్య భావోద్వేగ బంధం ఉంది" అని పేర్కొన్నారు. 2014లో లోక్‌సభ టికెట్ దక్కని సమయంలో తాను తీవ్ర నిరాశకు గురై రాత్రంతా ఏడ్చానని, ఆ సమయంలో సువేందు ధైర్యం చెప్పారని, అలాగే 2016 అసెంబ్లీ ఎన్నికల్లో తాను కరింపూర్ నుంచి పోటీ చేసినప్పుడు, సీనియర్ నేతలెవరూ రాకపోయినా సువేందు తన తొలి ర్యాలీలో పాల్గొన్నారని ఆమె గుర్తు చేసుకున్నారు. 2026 అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ చేతిలో టీఎంసీ ఓటమి పాలైన విషయం విదితమే. సువేందు అధికారి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టగా, మమతా బెనర్జీ సైతం పరాజయాన్ని చవిచూశారు. ఎన్నికల అనంతరం టీఎంసీలో సంక్షోభం మరింత ముదిరింది.



# 200 కార్మికుల నివాసాలు దగ్ధం

**ఢిల్లీలో భారీ అగ్నిప్రమాదం.. బుధవారం తెల్లవారుజామున ఘటన**

న్యూఢిల్లీ: ఢిల్లీలోని ఉద్యోగ్ భవన్ సమీపంలో ఉన్న కార్మికుల నివాసాల్లో (ఝుగ్గీలు) బుధవారం వేకువజామున భారీ అగ్నిప్రమాదం సంభవించింది. ఈ ప్రమాదంలో సుమారు 200 తాత్కాలిక రేకుల షెడ్లు అగ్నికి ఆహుతయ్యాయి. అదృష్టవశాత్తు ఎవరికీ ఎలాంటి గాయాలు కాలేదని, ప్రాణనష్టం తప్పిందని అధికారులు వెల్లడించారు. ఢిల్లీ అగ్నిమాపక దళం (ఐఖీూ) అధికారుల సమాచారం మేరకు.. తెల్లవారుజామున 3.02 గంటల ప్రాంతంలో కార్మికుల గుడిసెల వద్ద ఉన్న ఓ విద్యుత్ ప్యానెల్‌లో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. గుడిసెలు ఒకదానికొకటి ఆనుకుని ఉండటంతో పాటు, లోపల ఉన్న వంట గ్యాస్ సిలిండర్ల కారణంగా మంటలు అత్యంత వేగంగా వ్యాపించాయి. సమాచారం అందుకున్న వెంటనే 19 ఫైరింజన్లతో ఘటనా స్థలానికి చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది.. తీవ్రంగా శ్రమించి ఉదయం 5.30 గంటలకల్లా మంటలను పూర్తిగా అదుపులోకి తీసుకొచ్చారు. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వల్లే ఈ ప్రమాదం జరిగి ఉండొచ్చని అధికారులు ప్రాథమికంగా భావిస్తున్నారు. అయితే, ప్రమాదానికి గల కచ్చితమైన కారణం, ఆస్తి నష్టం అంచనాపై అధికారులు దర్యాప్తు చేస్తున్నారు. కాగా, కేంద్ర ప్రభుత్వ ప్రతిష్టాత్మక 'సెంట్రల్ విస్టా' ప్రాజెక్టులో భాగంగా.. 1950ల్లో నిర్మించిన ప్రముఖ ప్రభుత్వ కార్యాలయాల సముదాయం 'ఉద్యోగ్ భవన్'ను ప్రస్తుతం కూల్చివేస్తున్నారు. దాని పక్కనే ఉన్న నిర్మాణ్ భవన్ కూల్చివేత అనంతరం ఈ పనులు చేపట్టారు. ఈ పనుల్లో పాల్గొంటున్న కార్మికుల కోసమే ఇక్కడ ఈ తాత్కాలిక నివాసాలను ఏర్పాటు చేశారు.

## నీరవ్.. 108 కోట్లు కక్కు!


**లండన్ కోర్టు ఆదేశాలు జారీ**

లండన్: ఆర్థిక నేరగాడు నీరవ్ మోదీకి లండన్ సర్క్యూట్ కమర్షియల్ కోర్టు షాక్ ఇచ్చింది. బ్యాంక్ ఆఫ్ ఇండియాకు 11.5 మిలియన్ డాలర్ల (ఇండియన్ కరెన్సీలో దాదాపు 108 కోట్ల రూపాయలు) బకాయిలు చెల్లించాలని ఆదేశించింది. దుబాయ్‌కు చెందిన 'ఫైర్‌స్టార్ డైమండ్ ఎఫ్‌జెడ్‌ఈ' అనే కంపెనీకి నీరవ్ మోదీ అసోసియేట్‌గా ఉన్నారు. ఈ కంపెనీ బ్యాంక్ ఆఫ్ ఇండియా నుంచి రుణం తీసుకోవడానికి నీరవ్ మోదీ తన వ్యక్తిగత పూచీకత్తు ఇచ్చారు. ఫైర్‌స్టార్ డైమండ్ ఎఫ్‌జెడ్‌ఈ దివాళా తీయటంతో ఆ కంపెనీ తీసుకున్న అప్పు.. పూచీకత్తు ఇచ్చిన నీరవ్ మోదీపై పడింది. అయితే, ఆయన అప్పు తిరిగి చెల్లించలేదు. ఇండియా నుంచి లండన్ పారిపోయారు. దీంతో బ్యాంక్ ఆఫ్ ఇండియా లోన్ రికవరీ కోసం 2018లో లండన్ కోర్టును ఆశ్రయించింది. అప్పటినుంచి లండన్ కోర్టులో కేసు నడుస్తోంది. సుదీర్ఘ న్యాయపోరాటం తర్వాత బ్యాంక్ ఆఫ్ ఇండియాకు విజయం దక్కింది. 2026 మార్చి వరకు వడ్డీతో కలిపి 11.5 మిలియన్ డాలర్లు చెల్లించాలని లండన్ సర్క్యూట్ కమర్షియల్ కోర్టు న్యాయమూర్తి జస్టిస్ సైమన్ టింక్లర్ తుది తీర్పును వెలువరించారు. కాగా, పంజాబ్ నేషనల్ బ్యాంకు నుంచి వేల కోట్ల రూపాయలు తీసుకుని మోసగించిన కేసులో నిందితుడిగా ఉన్న నీరవ్ మోదీ ప్రస్తుతం బ్రిటన్ జైల్లో ఉన్నారు. నీరవ్ మోదీ కేసులో సీబీఐ దర్యాప్తు చేపడుతోంది. ఆయనను భారత్‌కు రప్పించేందుకు అనేక ప్రయత్నాలు చేస్తోంది. ఆయనపై పలు కేసులు ఉండటంతో ఈడీ కూడా దర్యాప్తు జరుపుతోంది.

# మునీర్ హత్యకు మొసాద్ ప్లాన్!?

**అమెరికా, ఇరాన్ మధ్య చర్చలకు పాకిస్థాన్ మధ్యవర్తిత్వం.. జెనీవాలో అసీమ్ మునీర్ హత్యకు ఇజ్రాయెల్ పథకం**

**బ్రెజిల్‌కు చెందిన ఇన్వెస్టిగేటివ్ జర్నలిస్ట్ ఆరోపణలు**



ఇస్లామాబాద్: ఇరాన్‌తో శాంతి చర్చల కోసం జెనీవాలో ఉన్న పాకిస్థాన్ సైన్యాధిపతి, ఫీల్డ్ మార్షల్ అసిమ్ మునీర్‌ను, ఆయనతో పాటు ఉన్న ప్రతినిధి బృందాన్ని హత్య చేయడానికి ఇజ్రాయెల్ గూఢచార సంస్థ మొసాద్ కుట్ర పన్నిందని బ్రెజిల్‌కు చెందిన ప్రముఖ ఇన్వెస్టిగేటివ్ జర్నలిస్ట్, భౌగోళిక రాజకీయ నిపుణుడు పెపె ఎస్కోబార్ సంచలన ఆరోపణలు చేశారు. అయితే, ఈ ఆరోపణను ఒక పాక్ జర్నలిస్ట్ మాత్రం ఖండించారు. అమెరికా, ఇరాన్‌ల మధ్య చర్చలకు పాకిస్థాన్ మధ్యవర్తిత్వం వహించే ప్రయత్నం చేస్తోన్న విషయం తెలిసిందే. ఈ ప్రాథమిక ఒప్పందానికి 'ఇస్లామాబాద్ అవగాహన ఒప్పందం' అని పేరు పెట్టారు. శాశ్వత ఒప్పందం కోసం అమెరికా, ఇరాన్ మధ్య తదుపరి చర్చలు జెనీవాలో జరిగాయి. ఇందులో అమెరికా తరఫున ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ బృందం, ఇరాన్ తరఫున విదేశాంగ మంత్రి అబ్బాసీ అరాఘ్చీ బృందం హాజరయ్యింది. రాజకీయ వ్యాఖ్యాత మారియో నౌఫల్ నిర్వహించిన ఒక పాడ్‌కాస్ట్‌లో.. బ్రెజిల్ ఇన్వెస్టిగేషన్ జర్నలిస్ట్, భౌగోళిక రాజకీయ విశ్లేషకుడు పెపె ఎస్కోబార్.. అసిమ్ మునీర్‌ను హత్య చేయడానికి మొస్సాద్ కుట్ర పన్నిందన్న సంచలన వాదన చేశారు. స్విట్జర్లాండ్‌లో జరుగుతున్న ఉన్నత స్థాయి చర్చల సందర్భంగా మునీర్‌ను, బహుశా పాకిస్తానీ ప్రతినిధి బృందంలోని ఇతర సభ్యులను కూడా ఇజ్రాయెల్ ప్రధాన మంత్రి బెంజిమిన్ నెతన్యాహు ఆదేశాలతో చంపడానికి మొస్సాద్ ప్లాన్ చేసినట్టు పాక్ గూఢచార సంస్థ ముందే పసిగట్టిందని ఎస్కోబార్ పేర్కొన్నారు. అమెరికా- ఇరాన్ శాంతి ఒప్పందాన్ని ఇజ్రాయెల్ తీవ్రంగా విమర్శించింది. తమను సంప్రదించలేదని అసంతృప్తి వ్యక్తం చేసిన ఇజ్రాయెల్.. లెబనాన్‌లోని హెజ్బొల్లాపై సైనిక చర్య ఆపే ప్రసక్తేలేదని తేల్చిచెప్పింది. పాడ్‌కాస్ట్‌లో దౌత్యపరమైన చర్చల వెనుక పాకిస్థాన్, ఇజ్రాయెల్ మధ్య జరుగుతున్న అంతర్గత ఘర్షణల నివేదికల గురించి అడిగిన ప్రశ్నకు ఎస్కోబార్ బదులిస్తూ.. 'బెంజిమిన్ నెతన్యాహు ఆదేశాల మేరకు.. స్విట్జర్లాండ్ వెళ్తున్న అసీమ్ మునీర్, ఇతర ప్రతినిధులపై హత్యాయత్నానికి మొసాద్ సిద్ధమవుతోందనే అత్యంత విశ్వసనీయమైన సమాచారం పాకిస్థాన్ సైన్యానికి అందింది' అని సంచలన వ్యాఖ్యలు చేశారు. మొసాద్ కుట్ర గురించి తెలుసుకున్న తర్వాత దౌత్య మార్గాల్లో పాకిస్థాన్ తీవ్రంగా స్పందించినట్లు ఎస్కోబార్ తెలిపారు. "తమ సాధారణ మధ్యవర్తులు అంటే ఒమన్ ద్వారానే అయి ఉంటుందని నేను పందెం కాయగలను.. నేరుగా ఇజ్రాయెల్‌కు ఒక సందేశం పంపారు. 'మీరు మా ప్రతినిధి బృందాన్ని తాకితే, మేము మిమ్మల్ని ప్రపంచ పటం నుంచి మాయం చేస్తామని హెచ్చరించింది..'" అని ఆయన అన్నారు. అంటే, అణ్వాయుధాలను ప్రయోగిస్తామని పాక్ పరోక్షంగా హెచ్చరించిందని ఆయన అన్నారు. అయితే, ఎస్కోబార్ వాదనను స్వతంత్రంగా ధ్రువీకరించలేదు. పాకిస్థాన్, ఇజ్రాయెల్ ప్రభుత్వాలు కూడా దీనిని నిర్ధారించలేదు. ఆయన వాదనకు మద్దతు ఇచ్చే ఎటువంటి ఆధారాలు కూడా లేవు. అమెరికా, ఇరాన్ మధ్య చర్చలకు మధ్యవర్తిత్వం కోసం ప్రధానమంత్రి షెహబాజ్ షరీఫ్ నేతృత్వంలో పాకిస్థాన్ ప్రతినిధి బృందం వెళ్లిన కొద్ది రోజులకే మునీర్ హత్య ఆరోపణలు వెలుగులోకి వచ్చాయి. మునీర్ ఆ ఉన్నత స్థాయి పాకిస్థానీ ప్రతినిధి బృందంలో భాగంగా ఉన్నారు అయితే, పాకిస్థానీ జర్నలిస్టులు కూడా ఎస్కోబార్ వాదనను కల్పితమని తిరస్కరించారు.

# ట్రెంట్‌కు నోయెల్ 'టాటా'

**కంపెనీ 47వ వార్షిక సమావేశంలో తన రిటైర్మెంట్ ప్రకటన**

**రతన్ టాటాకు నోయెల్ టాటా సోదరుడు**



ముంబై: టాటా గ్రూప్‌కు చెందిన రిటైల్ దిగ్గజం ట్రెంట్ లిమిటెడ్‌లో ఒక శకం ముగిసింది. కంపెనీ చైర్మన్‌గా దాదాపు మూడు దశాబ్దాల పాటు సేవలందించిన ప్రముఖ వ్యాపారవేత్త నోయెల్ టాటా తన పదవి నుంచి తప్పుకుంటున్నట్లు ప్రకటించారు. కంపెనీ 47వ వార్షిక సర్వసభ్య సమావేశంలో వాటాదారులను ఉద్దేశించి మాట్లాడుతూ, చైర్మన్‌గా ఇదే తన చివరి సమావేశమని ఆయన స్పష్టం చేశారు. దీంతో ఆయన సుదీర్ఘ ప్రస్థానానికి తెరపడినట్లయింది. టాటా గ్రూప్ గవర్నెన్స్ మార్గదర్శకాల ప్రకారం.. నాన్-ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ల పదవీ విరమణ వయసు 70 ఏళ్లుగా నిర్దేశించారు. ఈ ఏడాది నవంబర్‌లో నోయెల్ టాటాకు 70 ఏళ్లు నిండనున్న నేపథ్యంలో ఆయన ఈ నిర్ణయం తీసుకున్నారు. ఈ రిటైర్మెంట్ ప్రకటనతో టాటా గ్రూప్ రిటైల్ విభాగంలో ఆయన పోషించిన కీలక పాత్రకు ముగింపు పలికినట్లయింది. నోయెల్ టాటా ప్రస్థానం ట్రెంట్ కంపెనీతో విడదీయరానిది. ఆయన తల్లి సిమోన్ టాటా, ల్యాక్మేను విక్రయించిన తర్వాత ట్రెంట్ కంపెనీని స్థాపించారు. 1998లో నోయెల్ టాటా ఈ కంపెనీ బోర్డులో డైరెక్టర్‌గా చేరారు. ఆ మరుసటి ఏడాదే, 1999 జూన్ లో కంపెనీకి తొలి మేనేజింగ్ డైరెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించి, దేశంలో రిటైల్ వ్యూహాన్ని మార్చేసిన ఘనతను సొంతం చేసుకున్నారు. ఆయన నాయకత్వంలో ట్రెంట్ అద్భుతమైన వృద్ధిని సాధించింది. ఒక్క వెస్ట్‌సైడ్ స్టోర్‌తో ప్రారంభమైన ఈ కంపెనీ, నేడు దేశవ్యాప్తంగా 1,200కు పైగా స్టోర్లతో అతిపెద్ద రిటైల్ నెట్‌వర్క్‌లలో ఒకటిగా అవతరించింది. ముఖ్యంగా ఫ్యాషన్ రంగంలో 'జుడియో', సూపర్‌మార్కెట్ రంగంలో 'స్టార్' బ్రాండ్‌లను విజయవంతంగా విస్తరించి కంపెనీ వృద్ధిలో కీలక పాత్ర పోషించారు. కంపెనీ వార్షిక (ఎఫ్‌వై26) నివేదికలోనూ ట్రెంట్ ప్రయాణాన్ని ఒక స్థిరమైన పరిణామంగా ఆయన అభివర్ణించారు. ఆయన హయాంలోనే కంపెనీ ఆదాయం రూ.19,701 కోట్లకు చేరింది. దివంగత పారిశ్రామిక దిగ్గజం రతన్ టాటాకు నోయెల్ టాటా సోదరుడు కావడం గమనార్హం.

## ప్రైవేటుకు బీఎస్ఎన్ఎల్

# సీఎండీ పోస్టు!

**తొలిసారిగా ప్రైవేట్ రంగ నిపుణులకు అవకాశం.. రెండేళ్లుగా పూర్తిస్థాయి అధిపతి లేకుండా సంస్థ**

**భారీ నష్టాలతో సతమతమవుతున్న బీఎస్ఎన్ఎల్.. దరఖాస్తుల స్వీకరణకు జూలై 22 చివరి తేదీ**

న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగ టెలికాం దిగ్గజం భారత్ సంచార్ నిగమ్ లిమిటెడ్ (బీఎస్ఎన్ఎల్) ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ (సీఎండీ) పదవి భర్తీకి కేంద్ర ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేసింది. విశేషమేమిటంటే, ఈసారి ప్రైవేట్ రంగ నిపుణులకు కూడా ఈ పదవికి దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పిస్తూ టెలికాం శాఖ (డీఓటీ) నిర్ణయం తీసుకుంది. దాదాపు రెండేళ్లుగా పూర్తిస్థాయి అధిపతి లేకుండా కొనసాగుతున్న బీఎస్ఎన్ఎల్‌కు ఇది అత్యంత కీలక నియామకం. పబ్లిక్ ఎంటర్‌ప్రైజెస్ సెలక్షన్ బోర్డ్ (పీఈఎస్‌బీ) ఛైర్మన్ నేతృత్వంలోని సెర్చ్-కమ్-సెలక్షన్ కమిటీ (ఎస్‌సీఎస్‌సీ) ఈ నియామక ప్రక్రియను పర్యవేక్షించనుంది. ఆసక్తిగల అభ్యర్థులు జూలై 22 సాయంత్రం 3 గంటలలోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించింది. ఈ పదవికి వేతన స్కేలు నెలకు రూ. 80,000 నుంచి రూ. 1,25,000 వరకు నిర్ణయించారు. ప్రస్తుతం టెలికాం శాఖ ఉన్నతాధికారి రాబర్ట్ జె. రవి అదనపు బాధ్యతలతో సీఎండీగా కొనసాగుతున్నారు. ఆయన పదవీకాలాన్ని 2026 అక్టోబర్ వరకు పొడిగించారు. ఈ పదవికి దరఖాస్తు చేసుకునే అభ్యర్థుల వయసు 45 నుంచి 59 ఏళ్ల మధ్య ఉండాలి. ఇంజనీరింగ్, సీఏ, కాస్ట్ అకౌంటెన్సీ లేదా మేనేజ్‌మెంట్ విభాగాల్లో విద్యార్హతలు కలిగి ఉండటం తప్పనిసరి. ప్రైవేట్ రంగ అభ్యర్థులైతే, గత మూడేళ్లుగా సగటున రూ. 2,000 కోట్ల వార్షిక టర్నోవర్ ఉన్న సంస్థలో బోర్డు స్థాయి హోదాలో పనిచేసిన అనుభవం ఉండాలి. గతంలో 2025 నాటికి ఈ పదవిని భర్తీ చేయాలని ప్రయత్నించినప్పటికీ, తగిన అభ్యర్థి లభించకపోవడంతో ఈసారి విస్తృత స్థాయిలో నోటిఫికేషన్ జారీ చేశారు. ప్రైవేట్ టెలికాం సంస్థల నుంచి తీవ్ర పోటీ ఎదుర్కొంటున్న బీఎస్ఎన్ఎల్, ప్రస్తుతం ఆర్థిక సవాళ్లను ఎదుర్కొంటోంది. నికర నష్టం రూ. 4,738 కోట్లుగా నమోదైంది. ఈ నేపథ్యంలో 4జీ సేవలను పూర్తిస్థాయిలో అందుబాటులోకి తీసుకురావడం, 5జీ సన్నద్ధత, సంస్థను ఆర్థిక పునరుద్ధరణ పథంలో నడిపించడం వంటి కీలక బాధ్యతలు కొత్త సీఎండీపై ఉండనున్నాయి.

BSNL
Connecting Bharat
Securely • Affordably • Reliably

# ప్రజా భద్రతపై దృష్టి పెట్టండి

## పోలీసులకు ఎస్పీ అశోక్ కుమార్ సూచనలు.. మెట్‌పల్లి సర్కిల్ కార్యాలయం ప్రారంభం



మెట్‌పల్లి, జూన్ 24 (ఈవార్తలు): నేరాల నియంత్రణ, ప్రజా భద్రత, విజిబుల్ పోలీసింగ్‌పై ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా ఎస్పీ అశోక్‌కుమార్ ఐపీఎస్ పోలీసు అధికారులకు సూచించారు. ఆధునిక సౌకర్యాలతో పునరుద్ధరించిన మెట్‌పల్లి సర్కిల్ కార్యాలయాన్ని బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్యాలయంలో కల్పించిన సౌకర్యాలు, రికార్డుల నిర్వహణ, భద్రతా చర్యలు, సిబ్బంది పనితీరు, ప్రజలకు అందిస్తున్న సేవలను పరిశీలించారు. అనంతరం అధికారులతో సమీక్ష నిర్వహించి కార్యాలయ పరిసరాల పరిశుభ్రత, ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించే అంశాలపై పలు సూచనలు చేశారు. పోలీసు కార్యాలయాలు ప్రజలకు సులభంగా అందుబాటులో ఉండటంతో పాటు సిబ్బందికి అనుకూలమైన వాతావరణం కల్పిస్తే సేవల నాణ్యత మరింత మెరుగుపడుతుందని పేర్కొన్నారు. వార్షిక తనిఖీల్లో భాగంగా సర్కిల్ కార్యాలయాన్ని పరిశీలించిన ఎస్పీ, పరిధిలో నమోదవుతున్న గ్రేవ్ కేసులు, దర్యాప్తులో ఉన్న కేసుల సీడీ ఫైళ్లు, పెండింగ్ ట్రయల్ కేసుల రికార్డులను తనిఖీ చేశారు. ముఖ్యంగా పోక్సో కేసుల్లో నిందితులకు శిక్షలు పడేలా నాణ్యమైన దర్యాప్తు చేపట్టాలని సూచించారు. ఎస్ఓపీ ప్రకారం విచారణ నిర్వహించాలని, కేసుల దర్యాప్తులో నాణ్యతతో పాటు వేగం కూడా ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సర్కిల్ పరిధిలోని పోలీస్ స్టేషన్లను తరచుగా తనిఖీ చేస్తూ సిబ్బంది పనితీరును నిరంతరం పర్యవేక్షించాలని సీఐలకు సూచించారు. రౌడీషీటర్లు, హిస్టరీషీటర్లపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి వారి కదలికలను ఎప్పటికప్పుడు గమనించాలని తెలిపారు. వారికి సంబంధించిన తాజా సమాచారాన్ని ప్రతి నెల సేకరించి నమోదు చేసుకోవాలని ఆదేశించారు. కమ్యూనిటీ పోలీసింగ్‌లో భాగంగా ప్రజలకు సైబర్ నేరాలు, సామాజిక అంశాలు, ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించాలని సూచించారు. సీసీ కెమెరాల ప్రాధాన్యతను గ్రామాల్లో విస్తృతంగా ప్రచారం చేసి ప్రతి గ్రామంలో సీసీ కెమెరాల ఏర్పాటు దిశగా ప్రజలను చైతన్యపరచాలని తెలిపారు. నేరాల నియంత్రణలో విజిబుల్ పోలీసింగ్, సాంకేతిక పరిజ్ఞానం వినియోగంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, మాదకద్రవ్యాల నిర్మూలన, రోడ్డు భద్రత, శాంతిభద్రతల పరిరక్షణలో సమన్వయంతో పనిచేయాలని సూచించారు. అనంతరం మెట్‌పల్లి సర్కిల్ కార్యాలయ ఆవరణలో ఎస్పీ మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ రాములు, సీఐలు సురేష్‌బాబు, లక్ష్మీనారాయణ, డీసీఆర్‌బీ ఎస్ఐ ప్రదీప్, ఎస్ఐలు కిరణ్‌కుమార్, అనిల్, చిరంజీవి, నవీన్, గంగాధర్, రాజునాయక్, రవికిరణ్, శ్రీధర్‌రెడ్డి తదితర పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



## మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి

**మల్లాపూర్ జడ్పీహెచ్ఎస్‌లో యాంటీ డ్రగ్స్ అవగాహన కార్యక్రమం**

గంగాధర, జూన్ 24 (ఈవార్తలు): యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండి విద్య, క్రీడలు, సృజనాత్మక కార్యక్రమాల వైపు దృష్టి సారించాలని ఎస్సై వంశీకృష్ణ సూచించారు. కరీంనగర్ జిల్లా గంగాధర మండలంలోని మల్లాపూర్ జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో బుధవారం ఆయన ఆధ్వర్యంలో యాంటీ డ్రగ్స్ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు మాదక ద్రవ్యాల వల్ల కలిగే దుష్పరిణామాలు, వాటి నివారణలో యువత పాత్రపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో భాగంగా పోస్టర్ తయారీ, నినాదాల రచన, కవితా, రంగోలి పోటీలు నిర్వహించారు. మాదక ద్రవ్యాల నిర్మూలనలో విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, సమాజం సమిష్టిగా కృషి చేయాలని ఎస్సై పిలుపునిచ్చారు. మాదక ద్రవ్యాలకు సంబంధించిన సమాచారం ఉంటే 1908 టోల్‌ఫ్రీ నంబర్‌కు తెలియజేయాలని సూచించారు. అనంతరం వివిధ పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, పోలీసు సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



## డ్రగ్స్‌కు దూరంగా ఉండాలి

**యువత భవిష్యత్తును కాపాడుకోవాలి: డీసీపీ బీ రామ్‌రెడ్డి**

ధర్మారం, జూన్ 24 (ఈవార్తలు): యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండి తమ భవిష్యత్తును తీర్చిదిద్దుకోవాలని పెద్దపల్లి డీసీపీ బి. రామ్‌రెడ్డి ఐపీఎస్ సూచించారు. ధర్మారం మోడల్ స్కూల్ అండ్ కాలేజీలో అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడిన ఆయన, డ్రగ్స్ వినియోగం వల్ల ఆరోగ్యపరంగా, సామాజికంగా, ఆర్థికంగా తీవ్ర నష్టాలు కలుగుతాయని హెచ్చరించారు. డ్రగ్స్ రహిత తెలంగాణ నిర్మాణంలో విద్యార్థులు, యువత కీలక పాత్ర పోషించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పెద్దపల్లి సీఐ కె. ప్రవీణ్ కుమార్, ధర్మారం ఎస్ఐ ఎం. ప్రవీణ్ కుమార్, మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ రాజ్‌కుమార్ పాల్గొన్నారు. మత్తు పదార్థాలకు సంబంధించిన సమాచారం ఉంటే 1908 టోల్‌ఫ్రీ నంబర్ లేదా ఈగల్ ఫోర్స్ వాట్సాప్ నంబర్ 8712671111కు సమాచారం అందించాలని అధికారులు సూచించారు.



## ఓటరు జాబితా సవరణలో బీఎల్ఏల పాత్ర కీలకం

**అవగాహన సమావేశంలో డాక్టర్ భోగ శ్రావణి**

జగిత్యాల, జూన్ 24 (ఈవార్తలు): ప్రత్యేక సమగ్ర సవరణ ఓటరు జాబితా–2026 (ఎస్ఐఆర్) కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో బూత్ లెవల్ ఏజెంట్లు (బీఎల్ఏ--2) కీలక పాత్ర పోషించాలని బీజేపీ జగిత్యాల నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ భోగ శ్రావణి అన్నారు. జగిత్యాల పట్టణంలోని వీకేబీ ఫంక్షన్ హాల్‌లో బుధవారం నిర్వహించిన ప్రత్యేక సమగ్ర సవరణ ఓటరు జాబితా--2026 అవగాహన సమావేశంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ప్రతి అర్హుడైన ఓటరు పేరు ఓటరు జాబితాలో నమోదయ్యేలా పార్టీ శ్రేణులు క్షేత్రస్థాయిలో విస్తృతంగా పనిచేయాలని సూచించారు. ఓటరు నమోదు, మార్పులు, చేర్పులు, తొలగింపుల ప్రక్రియపై ప్రజలకు అవగాహన కల్పించాలని కోరారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత విలువైనదని, అర్హులైన ప్రతి ఒక్కరు ఓటరు జాబితాలో పేరు నమోదు చేసుకునేలా కృషి చేయాలని తెలిపారు. ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమాన్ని పార్టీ నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో ముందుకు తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు, జిల్లా, మండల పదాధికారులు, కౌన్సిలర్లు, వేముల శ్రీనివాస్, వివిధ మోర్చాల నాయకులు, బూత్ లెవల్ ఏజెంట్లు, శక్తికేంద్రాలు, బూత్ స్థాయి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ధర్మపురి డిగ్రీ కాలేజీకి హాల్ 10 కోట్లు

హైదరాబాద్, జూన్ 24 (ఈవార్తలు): జగిత్యాల జిల్లా ధర్మపురి నియోజకవర్గంలో ఉన్నత విద్యా అవకాశాల విస్తరణకు కీలక ముందడుగు పడింది. కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ హిందుస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్ (హాల్) తన కార్పొరేట్ సామాజిక బాధ్యత నిధుల కింద రూ.10 కోట్ల వ్యయంతో ధర్మపురిలో నూతన డిగ్రీ కళాశాల భవన నిర్మాణానికి ముందుకు వచ్చింది. సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ప్రత్యేక చొరవతో ఈ ప్రాజెక్టు రూపుదిద్దుకుంది. బుధవారం డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో హాల్ ప్రతినిధులు, జగిత్యాల జిల్లా యంత్రాంగం మధ్య అవగాహన ఒప్పందం కుదిరింది. ఈ ఒప్పందంపై జిల్లా కలెక్టర్ బీ సత్యప్రసాద్, హాల్ హైదరాబాద్ చీఫ్ ఆఫ్ ప్రాజెక్ట్స్ ఎ.వి. మురళీకృష్ణ, డీజీఎం (హెచ్ఆర్) సూర్యకాంత్ రౌత్, సీనియర్ మేనేజర్ ఎస్. సత్యనారాయణ సంతకాలు చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత విద్యార్థులకు నాణ్యమైన ఉన్నత విద్య అందుబాటులోకి తీసుకురావడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. ధర్మపురి, పరిసర మండలాల విద్యార్థులకు ఈ కళాశాల ఎంతో ఉపయోగకరంగా మారనుందని తెలిపారు. ఆధునిక గదులు, ప్రయోగశాలలు, గ్రంథాలయం, డిజిటల్ సదుపాయాలతో కళాశాల నిర్మాణం చేపట్టనున్నట్లు తెలిపారు.



## సాఫ్ట్ వేర్ కోర్సుల్లో ఉచిత శిక్షణ



హైదరాబాద్, జూన్ 24 (ఈవార్తలు): స్వర్ణ తెలంగాణ స్వయం ఉపాధి శిక్షణ పథకం ద్వారా 36వేల మంది నిరుద్యోగ యువతీ యువకులకు ఉచితంగా 100కు పైగా వివిధ కంప్యూటర్ సాఫ్ట్ వేర్ కోర్సుల్లో ఆన్ లైన్ ద్వారా ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు పేస్ కంప్యూటర్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ ఏ. వెంకట్ రెడ్డి తెలిపారు. ఆన్ లైన్ ఈ లెర్నింగ్ ద్వారా కోర్స్ పూర్తిచేసిన యువతకు కేంద్ర ప్రభుత్వం ఆమోదంచే నేషనల్ స్కిల్ అకాడమీ ద్వారా సర్టిఫికెట్ అందజేయడం జరుగుతుందని ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఆసక్తిగల నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. నేటి సమాజంలో పేద, మధ్యతరగతి విద్యార్థిని విదార్థులకు, నిరుద్యోగ యువతీ యువకులకు అత్యధిక జీత భత్యాలు, ఉద్యోగ అవకాశాలు గల కంప్యూటర్ సాఫ్ట్వేర్ రంగంలో ఆన్లైన్ శిక్షణ అందించడం ద్వారా ఉద్యోగావకాశాలు కల్పించేందుకు కంప్యూటర్ సాఫ్ట్వేర్ శిక్షణ రంగంలో 34 సంవత్సరాల అనుభవం గల పేస్ కంప్యూటర్ ఎడ్యుకేషన్ సంస్థ నేషనల్ స్కిల్ అకాడమీ ఆధ్వర్యంలో ప్రతి ఏటా లేటెస్ట్ కంప్యూటర్ సాఫ్ట్వేర్ కోర్సుల్లో ఆన్లైన్ లో శిక్షణను అందించనున్నట్లు తెలిపారు. ఈ పథకం క్రింద ఏఐ, డేటా సైన్స్, మెషిన్ లెర్నింగ్, సైబర్ సెక్యూరిటీ, క్లౌడ్ కంప్యూటింగ్ వంటి 100 కోర్సులు ఎలాంటి కోర్స్ ఫీజు లేకుండా ఆన్ లైన్ ఈ–లెర్నింగ్ ద్వారా శిక్షణను అందించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ కోర్సులు పూర్తి చేసిన అభ్యర్థులకు విదేశాలలో అధిక వేతనాలతో ఉత్తమ ఉపాధి అవకాశాలు ఉంటాయని తెలిపారు. స్వర్ణ తెలంగాణ స్వయం ఉపాధి శిక్షణా పథకం ద్వారా రూ.1,50,000 వరకు కోర్స్ ఫీజులు గల వివిధ లేటెస్ట్ కంప్యూటర్ సాఫ్ట్వేర్ డిప్లొమా, పీజీ డిప్లొమా కోర్సులు ఎలాంటి కోర్స్ ఫీజు లేకుండా నేర్చుకొని సాఫ్ట్వేర్ రంగంలో ఉద్యోగాలు పొందాలని ఆయన సూచించారు. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఇంటర్, డిగ్రీ, ఇంజనీరింగ్, పీజీ విద్యార్థినీ విద్యార్థులు, నిరుద్యోగ యువతీ యువకులు జూలై 31వ తేదీ లోగా ఆన్ లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని కోరారు. వివరాలకు ఫోన్: 9505800047 చేయాలని సూచించారు.

## మల్యాలలో భారీ చోరీ

**ఇంటి తాళాలు పగులగొట్టి రూ.లక్షల విలువైన బంగారం, వెండి, నగదుతో పరార్**



మల్యాల, జూన్ 24 (ఈవార్తలు): జగిత్యాల జిల్లా మల్యాల మండల కేంద్రంలో మంగళవారం అర్ధరాత్రి దొంగలు రెచ్చిపోయారు. కరీంనగర్‌లో ఉద్యోగం చేస్తున్న కాల్వాల యుగేందర్‌కు చెందిన ఇంటిని లక్ష్యంగా చేసుకుని గుర్తు తెలియని దుండగులు తాళాలు, తలుపులు పగులగొట్టి లోపలికి ప్రవేశించారు. అనంతరం బీరువాను ధ్వంసం చేసి అందులో ఉన్న 4 తులాల బంగారం, 40 తులాల వెండి సామాగ్రి, రూ.50 వేల నగదును అపహరించారు. ఇంటి యజమాని ఇంటికి వచ్చి చూడగా చోరీ జరిగిన విషయం వెలుగులోకి వచ్చింది. సమాచారం అందుకున్న మల్యాల పోలీసులు వెంటనే ఘటనాస్థలికి చేరుకుని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. నిందితులను గుర్తించేందుకు పోలీస్ క్లూస్ టీమ్, ఫింగర్‌ప్రింట్ (ఐడీ/ఎఫ్‌పీ) టీమ్ ఘటనాస్థలికి చేరుకుని ఆధారాలను సేకరించాయి.

## కరీంనగర్‌లో కారు గుర్తు సునామీ ఖాయం

**కాంగ్రెస్ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి: కేటీఆర్**



కరీంనగర్, జూన్ 24 (ఈవార్తలు): కరీంనగర్ జిల్లా అనాదిగా భారత రాష్ట్ర సమితికి అండగా నిలిచిందని, ఎప్పుడు ఎన్నికలు జరిగినా జిల్లాలో కారు గుర్తుదే విజయమని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. మాజీ మంత్రి, కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ నివాసంలో బుధవారం నిర్వహించిన ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేల సమావేశంలో ఆయన పాల్గొని పార్టీ నేతలకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ గత అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలు, ప్రజలను తప్పుదోవ పట్టించిన ప్రచారం కారణంగా కొన్ని స్థానాల్లో ఫలితాలు ప్రతికూలంగా వచ్చాయని పేర్కొన్నారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలు ప్రజలకు స్పష్టంగా కనిపిస్తున్నాయని అన్నారు. పార్టీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేయడంతో పాటు కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలు, అమలు కాని హామీలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని నాయకులకు సూచించారు. రాబోయే ఎన్నికలకు ఇప్పటి నుంచే సిద్ధమై ప్రజా సమస్యలపై ఉద్యమాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. కరీంనగర్ జిల్లా బీఆర్ఎస్‌కు కోటలాంటిదని, కార్యకర్తలు ఐక్యంగా పనిచేస్తే జిల్లాలో మళ్లీ కారు గుర్తు జెండా ఎగురుతుందని ధీమా వ్యక్తం చేశారు. సమావేశంలో ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు, పార్టీ ముఖ్య నేతలు పాల్గొన్నారు.



## 'సర్'కు అంతా సహకరించాలి

**జగిత్యాల అదనపు కలెక్టర్ బీఎస్ లత**

జగిత్యాల, జూన్ 24 (ఈవార్తలు): ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు రాజకీయ పార్టీలు, ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రజలు పూర్తి సహకారం అందించాలని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) బి.ఎస్. లత కోరారు. బుధవారం రాజకీయ పార్టీల ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ, జూన్ 25 నుంచి జూలై 24 వరకు బీఎల్‌వోలు ఇంటింటి సర్వే నిర్వహించి ఎన్యూమరేషన్ ఫారాలు పంపిణీ చేసి తిరిగి సేకరిస్తారని తెలిపారు. అర్హులైన ప్రతి ఓటరు జాబితాలో నమోదయ్యేలా రాజకీయ పార్టీలు సహకరించాలని సూచించారు. ఎన్నికల సంఘం నిబంధనల మేరకే కార్యక్రమం నిర్వహిస్తున్నామని, అర్హులైన ఒక్క ఓటరు కూడా జాబితా నుంచి మినహాయించబడకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఓటర్ల మార్పులు, చేర్పులకు ఫారం–8, కొత్త ఓటర్ల నమోదుకు ఫారం–6 వినియోగించాలని సూచించారు. సమావేశంలో జగిత్యాల, కోరుట్ల, మెట్‌పల్లి ఆర్డీవోలు మధుసూదన్, జీవాకర్ రెడ్డి, నరసింహారావు, మున్సిపల్ కమిషనర్లు, రాజకీయ పార్టీల ప్రతినిధులు, ఎంఐఎం జిల్లా అధ్యక్షుడు లియాఖత్ అలీ మోసిన్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



## మాగంటి ప్రథమ వర్ధంతి ఏర్పాట్ల పరిశీలన

యూసుఫ్‌గూడ–హైదరాబాద్, జూన్ 24 (ఈవార్తలు): జూబ్లీహిల్స్ నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే, స్వర్గీయ మాగంటి గోపీనాథ్ ప్రథమ వర్ధంతి సందర్భంగా నిర్వహించనున్న సంస్మరణ సభ ఏర్పాట్లను బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు నవీన్ పోగుల పరిశీలించారు. గురువారం యూసుఫ్‌గూడలోని శౌర్య కన్వెన్షన్‌లో మాగంటి గోపీనాథ్ సతీమణి మాగంటి సునీత ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరగనుంది. ఈ సందర్భంగా సభా ప్రాంగణంలో జరుగుతున్న ఏర్పాట్లను పరిశీలించిన నవీన్ పోగుల.. కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు అవసరమైన సూచనలు చేశారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేసి, ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు చేరవేసేందుకు విశేషంగా శ్రమించిన మాగంటి గోపీనాథ్ సేవలను ఈ సందర్భంగా స్మరించుకున్నారు. సంస్మరణ సభకు పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై స్వర్గీయ మాగంటి గోపీనాథ్‌కు ఘన నివాళులు అర్పించాలని నవీన్ పోగుల పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు సల్లా శ్రీనివాస్ యాదవ్, నాగరాజు, ప్రసాద్ చౌదరి, నాగు తదితరులు పాల్గొన్నారు.



## 26న పద్మశాలి ఉద్యోగుల రాష్ట్ర సదస్సు

హైదరాబాద్, జూన్ 24 (ఈవార్తలు): తెలంగాణ పద్మశాలి ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో ఈనెల 26న రాష్ట్ర స్థాయి పద్మశాలి ఉద్యోగుల సదస్సు నిర్వహించనున్నట్లు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఈగ వెంకటేశ్వర్లు తెలిపారు. ఈ సదస్సు హైదరాబాద్‌లోని ఎల్‌బీ నగర్‌లో ఉన్న స్వకులశాలి సమాజ భవనంలో జరగనుందని వెల్లడించారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. తెలంగాణ పద్మశాలి ఉద్యోగుల సంఘం చేపడుతున్న వివిధ కార్యక్రమాలు, భవిష్యత్ కార్యాచరణ, పద్మశాలి ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలు, వాటి పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలు తదితర అంశాలపై సదస్సులో విస్తృతంగా చర్చించనున్నట్లు వెల్లడించారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి పద్మశాలి ఉద్యోగులు పెద్ద సంఖ్యలో హాజరై సదస్సును విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. సంఘం బలోపేతంతో పాటు ఉద్యోగుల సంక్షేమానికి సంబంధించిన అంశాలపై కార్యాచరణను మరింత సమర్థవంతంగా ముందుకు తీసుకెళ్లేందుకు ఈ సమావేశం దోహదపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

## మహ్మద్ సయ్యద్‌కు కీలక పదవి



హైదరాబాద్, జూన్ 24 (ఈవార్తలు): తెలంగాణ దూదేకుల ముస్లిం వెల్ఫేర్ ఆర్గనైజేషన్ సెక్రటరీగా మహమ్మద్ సయ్యద్‌ను నియమిస్తూ సంస్థ అధ్యక్షుడు మహమ్మద్ అజీముద్దీన్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు బుధవారం హైదరాబాద్‌లోని తెలంగాణ సచివాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు మహమ్మద్ అజీముద్దీన్ మాట్లాడుతూ, సంస్థ అభివృద్ధికి, దూదకుల ముస్లిం సమాజ సంక్షేమానికి మహమ్మద్ సయ్యద్ కృషి చేయాలని ఆకాంక్షించారు. కొత్త బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించి, సమాజ అభ్యున్నతికి పాటుపడతానని మహమ్మద్ సయ్యద్ తెలిపారు. కార్యక్రమంలో మహమ్మద్ బషీర్, మహమ్మద్ రజాక్, హమీద్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

## పిచ్చికుక్క బీభత్సం.. ఆరుగురికి గాయాలు



ఎండపల్లి, జూన్ 24 (ఈవార్తలు): జగిత్యాల జిల్లా ఎండపల్లి మండలం గుడిసెలపేట గ్రామంలో పిచ్చికుక్క స్వైర విహారం చేసి ఆరుగురిపై దాడి చేసింది. ఈ ఘటనలో పలువురు గాయపడగా, ఓ మహిళ ముఖంపై తీవ్రంగా గాయపడినట్లు సమాచారం. గాయపడిన వారిని వెంటనే జగిత్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. మహిళ పరిస్థితి విషమంగా ఉండటంతో వైద్యులు ప్రత్యేక పర్యవేక్షణలో చికిత్స అందిస్తున్నట్లు తెలిసింది. గ్రామంలో పిచ్చికుక్క సంచారంతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. వీధి కుక్కల సమస్య రోజురోజుకూ పెరుగుతోందని, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం, సంబంధిత అధికారులు తక్షణ చర్యలు చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.

## సినిమాలకు సమంత మళ్లీ బ్రేక్




స్టార్ హీరోయిన్ సమంత తాను తల్లి కాబోతున్నట్లు స్పష్టత ఇచ్చారు. ఈ నేపథ్యంలో సినిమాలకు తాత్కాలికంగా విరామం తీసుకుంటున్నట్లు వెల్లడించారు. తన తాజా చిత్రం 'మా ఇంటి బంగారం' సక్సెస్ మీట్‌లో బుధవారం ఆమె ఈ శుభవార్తను అభిమానులతో పంచుకున్నారు. కొద్ది వారాలుగా ఆమె గర్భవతి అంటూ వస్తున్న ఊహాగానాలకు ఈ ప్రకటనతో తెరపడింది. 'మా ఇంటి బంగారం' చిత్ర విజయోత్సవ వేడుకలో సమంత మాట్లాడుతూ, ఈ పరిణామం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. ప్రస్తుతం తాను కొంతకాలం సినిమాలకు దూరంగా ఉండనున్నట్లు తెలిపారు. ఈ సినిమాకు దర్శకత్వం వహించిన బి.వి. నందినీ రెడ్డి కూడా ఈ వార్తను ధృవీకరించారు. సినిమా ఘన విజయం సాధించిన తరుణంలో ఈ శుభవార్త రావడం ఎంతో ఆనందంగా ఉందని అన్నారు. సమంత నిర్మాతగా వ్యవహరించిన ఈ చిత్రం, విడుదలైన 5 రోజుల్లోనే ప్రపంచవ్యాప్తంగా □50 కోట్లకు పైగా వసూళ్లు సాధించడం విశేషం. కొన్ని రోజులుగా 'మా ఇంటి బంగారం' సక్సెస్ వేడుకల వీడియోలలో సమంత బేబీ బంప్‌తో కనిపించడంతో ఆమె గర్భవతి అనే ప్రచారం మొదలైంది. ఆమె ప్రస్తుతం తొలిదశ గర్భంతో ఉన్నారని, డిసెంబర్ 2026లో బిడ్డకు జన్మనివ్వనున్నారని సన్నిహిత వర్గాలు తెలిపాయి.




## సెప్టెంబర్ 2న సర్దార్ -2

కోలీవుడ్ హీరో కార్తీ నటించిన సీక్వెల్ మూవీ సర్దార్-2. గతంలో వచ్చిన సర్దార్‌కు కొనసాగింపుగా ఈ చిత్రాన్ని తెరకెక్కించారు. ఈ మూవీ షూటింగ్ గతేడాది జూన్‌లోనే పూర్తయి ఏడాది కావోస్తోన్న ఇప్పటికీ రిలీజ్‌కు నోచుకోలేదు. ఈ సినిమా రిలీజ్ డేట్ కోసం కార్తీ ఫ్యాన్స్ ఎప్పటి నుంచో ఎదురు చూస్తున్నారు. ఎట్టకేలకు వారి నిరీక్షణకు తెరపడింది. ఈ మూవీ విడుదల తేదని మేకర్స్ ఖరారు చేశారు. ఈ చిత్రాన్ని సెప్టెంబర్ 10న దీన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నట్లు అఫీషియల్‌గా ప్రకటించారు. దీంతో కార్తీ ఫ్యాన్స్ ఫుల్ ఖుషీ అవుతున్నారు. ఇప్పటికైనా రిలీజ్ డేట్ ఫిక్స్ కావడంతో ఫ్యాన్స్ ఆనందం వ్యక్తం చేస్తున్నారు. పార్ట్-1 సూపర్ హిట్ కావడంతో సర్దార్ 2పై కూడా అభిమానుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ మూవీ కార్తీకి జంటగా మాళవిక మోహనన్, ఆషికా రంగనాథ్ హీరోయిన్లుగా కనిపించనున్నారు. ఈ సినిమాలో ఎస్‌జే సూర్య విలన్ పాత్రలో మెప్పించనున్నారు.

## నేటి హీరోయిన్లు రిస్క్ తీసుకోవట్లే



బాలీవుడ్‌లో తరాలు మారినా నటీమణుల పని తీరు, అంకితభావం మాత్రం పెద్దగా మారలేదని ప్రముఖ నటుడు అక్షయ్ కుమార్ అభిప్రాయపడ్డారు. అయితే ఒక విషయంలో మాత్రం నేటి తరం హీరోయిన్లు తమ సీనియర్లతో పోలిస్తే భిన్నంగా ఉన్నారని అన్నారు. రిస్క్ తీసుకునే విషయంలో కొత్త తరం నటీమణులు అంతగా ముందుకు రావడం లేదని వ్యాఖ్యానించారు. తన తాజా చిత్రం 'వెల్‌కమ్ టు ది జంగిల్' ప్రచార కార్యక్రమాల్లో భాగంగా ఐఏఎన్ఎస్‌కు ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో అక్షయ్ ఈ వ్యాఖ్యలు చేశారు. ఈ సినిమాలో 90ల నాటి హీరోయిన్ల నుంచి ప్రస్తుత తరం నటీమణుల వరకు పలువురు కలిసి నటించారు. ఈ సందర్భంగా వివిధ తరాల నటీమణుల మధ్య తేడాల గురించి అక్షయ్‌ను ప్రశ్నించారు. దీనికి స్పందించిన ఆయన "అందరూ ప్రొఫెషనల్‌గానే ఉంటారు. అందరూ ప్రతిభావంతులే. నటన పరంగా పెద్దగా తేడా కనిపించదు.



## అమ్మాయిలూ.. సినీ ఇండస్ట్రీ వద్దు: సింగర్ సునీత

'సినీ ఇండస్ట్రీ మహిళలకు కచ్చితంగా సేఫ్ కాదు. నేను ఈ పరిశ్రమలో సక్సెస్‌ఫుల్ వుమెన్ అయినా కూడా ఇదే చెబుతున్నాను. బయటకు వచ్చి నాకు ఇలా జరిగింది, అలా జరిగింది అని చెప్పడం నాకు పెద్దగా ఇష్టం ఉండదు. ఎందుకంటే ఇది ఒక్కరి సమస్య కాదు. చాలా మంది ఎదుర్కొనే పరిస్థితి అని అన్నారు. ఇండస్ట్రీలో కొన్ని సందర్భాల్లో దోపిడీ, అసభ్య ప్రవర్తన వంటి సమస్యలు ఉంటాయ'ని సింగర్ సునీత అన్నారు. తనకు కేవలం 18 ఏళ్ల వయసులోనే ఇలాంటి అసౌకర్యకర పరిస్థితి ఎదురైందని వెల్లడించారు. అయితే ఆ ఘటన గురించి మరిన్ని వివరాలు చెప్పడానికి ఆమె ఆసక్తి చూపలేదు.ఆ విషయాలను పదే పదే చర్చించడం నాకు ఇష్టం ఉండదు. అలాంటి చర్చలకు ముగింపు ఉండదు అని ఆమె అన్నారు. ఇండస్ట్రీలో కొంతమంది ఒకరి వద్ద చాలా గౌరవంగా ప్రవర్తిస్తే, మరొకరి వద్ద పూర్తిగా భిన్నంగా ప్రవర్తించే పరిస్థితులు ఉంటాయని సునీత వ్యాఖ్యానించారు. ఒక వ్యక్తి ఒకరి దగ్గర పెద్దమనిషిలా ప్రవర్తించవచ్చు. అదే వ్యక్తి మరొకరి వద్ద వేరేలా ప్రవర్తించవచ్చు అంటూ ఆమె పేర్కొన్నారు. మహిళల స్వేచ్ఛ, ఫెమినిజం గురించి కూడా సునీత తన అభిప్రాయాన్ని వెల్లడించారు.




## విజయ్‌తో దిల్ రాజు భేటీ

తెలుగు సినీ నిర్మాత దిల్ రాజు, తమిళనాడు ముఖ్యమంత్రి, నటుడు విజయ్‌ను చెన్నైలో మర్యాదపూర్వకంగా కలిశారు. విజయ్ పుట్టినరోజును పురస్కరించుకుని దిల్ రాజు ఆయనకు ప్రత్యేకంగా శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా విజయ్‌కు పుష్పగుచ్ఛం అందించి తన అభిమానాన్ని చాటుకున్నారు. వీరిద్దరి మధ్య భేటీ ఎంతో ఆత్మీయంగా, ఆహ్లాదకర వాతావరణంలో జరిగింది. ఈ భేటీకి సంబంధించిన ఫొటోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. దిల్ రాజు గతంలో విజయ్ హీరోగా 'వారిసు' అనే భారీ చిత్రాన్ని నిర్మించిన విషయం తెలిసిందే. ఈ సినిమా తెలుగులో 'వారసుడు' పేరుతో విడుదలైంది. ఆ సినిమా సమయం నుంచి వీరిద్దరి మధ్య మంచి అనుబంధం కొనసాగుతోంది. ఇప్పుడు విజయ్ రాజకీయాల్లోకి ప్రవేశించి ముఖ్యమంత్రి పదవిని చేపట్టిన తర్వాత దిల్ రాజు తొలిసారిగా ఆయనను కలిశారు.

## అబ్సెషన్ హాలీవుడ్ హద్దులను చెరిపేసింది



వరల్డ్ స్టార్ ప్రియాంక చోప్రా, చిత్ర పరిశ్రమలో అడుగుపెట్టాలనుకునే కొత్త టాలెంట్‌కు ఇప్పుడు అద్భుతమైన అవకాశాలు ఉన్నాయని అన్నారు. ఒక మంచి ఆలోచన ఉంటే చాలు, తక్కువ బడ్జెట్‌తోనూ ప్రపంచవ్యాప్తంగా విజయం సాధించవచ్చని, ఇటీవల విడుదలై సంచలనం సృష్టించిన హారర్ సినిమా 'అబ్సెషన్' దీనికి చక్కటి ఉదాహరణ అని ఆమె పేర్కొన్నారు. బుధవారం కేన్స్ లయన్స్ సదస్సులో పాల్గొన్న ప్రియాంక, మారుతున్న సినిమా ప్రపంచంపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. 'అబ్సెషన్' వంటి సినిమాలతో హాలీవుడ్ హద్దులు చెరిగిపోతున్నాయని అభిప్రాయపడ్డారు. "మీ దగ్గర ఒక ఐడియా ఉంటే, దాన్ని షూట్ చేసి యూట్యూబ్‌లో పెట్టండి. అది 'అబ్సెషన్' లాంటి పెద్ద హిట్ సినిమా కూడా కావచ్చు. వినోద రంగంలో ఉండటానికి ఇది సరైన సమయం, ఎందుకంటే ఇప్పుడు మీ ఆలోచనలే మీ ఆస్తి" అని ప్రియాంక తెలిపారు. ఒకప్పుడు పరిస్థితి ఇలా ఉండేది కాదని ఆమె గుర్తుచేసుకున్నారు. గత పదేళ్లుగా హాలీవుడ్‌లో కెరీర్ నిర్మించుకుంటున్న ప్రియాంక, తాను పరిశ్రమలోకి అడుగుపెట్టినప్పుడు ఎదుర్కొన్న సవాళ్లను పంచుకున్నారు.





## జాన్వీ ఇంట్లో పెళ్లి బాజాలు

బాలీవుడ్‌లో మరో స్టార్ వెడ్డింగ్‌కు రంగం సిద్ధమైంది. ప్రముఖ నిర్మాత బోనీ కపూర్ కుటుంబంలో పెళ్లి బాజాలు మోగుతున్నాయి. ఆయన పెద్ద కుమార్తె అన్షులా కపూర్ వివాహ వేడుకలు ముంబైలో ఘనంగా ప్రారంభమయ్యాయి. తన లాంగ్‌టైమ్ బాయ్‌ఫ్రెండ్ రోహన్ థక్కర్‌తో అన్షులా త్వరలోనే వివాహ బంధంలోకి అడుగుపెట్టనుండగా, ప్రస్తుతం ప్రీ వెడ్డింగ్ వేడుకలు కుటుంబ సభ్యుల మధ్య సందడిగా సాగుతున్నాయి.గత ఏడాది న్యూయార్క్‌లో సన్నిహితుల సమక్షంలో నిశ్చితార్థం చేసుకున్న అన్షులా-రోహన్ జంట ఇప్పుడు జూలై 6న పెళ్లి పీటలెక్కబోతోంది. దీంతో కపూర్ కుటుంబంలో ఇప్పటికే పెళ్లి సందడి మొదలైంది. ఈ వివాహ వేడుకల తొలి కార్యక్రమంగా ముంబైలో సంప్రదాయబద్ధంగా 'మాతా కీ చౌకీ' పూజను నిర్వహించారు. వరుడు రోహన్ థక్కర్ కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో జరిగిన ఈ పూజలో ఇరు కుటుంబాల సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా దిగిన ఫొటోలను అన్షులా సోషల్ మీడియాలో పంచుకుంటూ, "ప్రేమ, కుటుంబం, దేవుని ఆశీస్సులతో మా కొత్త ప్రయాణం ప్రారంభమవుతోంది" అంటూ భావోద్వేగ పోస్ట్ చేసింది.అన్షులా పెళ్లి వేడుకల్లో అన్నయ్య అర్జున్ కపూర్ ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నారు. తల్లి మోనా శౌరీ కపూర్ మరణం తర్వాత అన్షులాకు అర్జున్ కపూరే అండగా నిలిచారు. చెల్లెలి బాధ్యతలను తన భుజాలపై వేసుకుని కుటుంబానికి పెద్దగా వ్యవహరించిన అర్జున్, ఇప్పుడు ఆమె పెళ్లి ఏర్పాట్లను కూడా దగ్గరుండి చూసుకుంటున్నారు.

## మాట్లాడినా, మాట్లాడకున్నా తప్పే

సూపర్‌స్టార్ రజనీకాంత్, లోకనాయకుడు కమల్ హాసన్ కలయికలో రూపొందుతున్న ప్రతిష్ఠాత్మక చిత్రం టైటిల్‌ను బుధవారం చెన్నైలో అధికారికంగా ప్రకటించారు. రజనీకాంత్ 173వ చిత్రంగా తెరకెక్కుతున్న ఈ సినిమాకు 'ధర్మన్' అనే టైటిల్‌ను ఖరారు చేశారు. ఈ సందర్భంగా రజనీకాంత్ మాట్లాడుతూ, వర్తమాన పరిస్థితుల్లో బహిరంగంగా మాట్లాడాలంటేనే భయమేస్తోందని, తన మాటలను నిరంతరం తప్పుగా అర్థం చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. "ఇటీవలి కాలంలో వేదికలపై మాట్లాడాలంటేనే సంకోచించాల్సిన పరిస్థితి నెలకొంది. నేను మాట్లాడితే అదో ఒక సమస్యగా మారుతోంది. మౌనంగా ఉంటే ఎందుకు మాట్లాడటం లేదని ప్రశ్నిస్తున్నారు. ఒకవేళ మాట్లాడితే, ఈ సమయంలో ఎందుకు మాట్లాడాల్సి వచ్చిందని అడుగుతున్నారు. అసలు ఏమీ మాట్లాడొద్దని మరికొందరు సలహాలిస్తున్నారు. ఇవన్నీ గమనించిన తర్వాత నాకు ఒక విషయం అర్థమైంది. మనల్ని ఇష్టపడని వారికి మనం ఏం చేసినా నచ్చదు" అని రజనీకాంత్ పేర్కొన్నారు. కమల్ హాసన్ మాట్లాడుతూ, "మేమిద్దరం ఏవీఎం స్టూడియోలోని ఒక వేప చెట్టు కింద కూర్చుని పెద్ద కలలు కన్నాం. నేడు ఈ స్థాయిలో ఇక్కడ ఉన్నాం. ఈ సినిమా పట్ల రజనీకాంత్ ఎంతో ఉత్సాహంగా ఉన్నారు. తాను కమల్ హాసన్ నిర్మాణంలో నటిస్తున్నానని అందరికీ ఫోన్లు చేసి మరీ చెబుతున్నారు" అని సరదాగా వ్యాఖ్యానించారు.






# గిల్ నం.2

**మేటి వన్డే బ్యాటర్ల జాబితాను ఐసీసీ రిలీజ్ చేసింది. భారత కెప్టెన్ శుభమన్ గిల్ ఆ ర్యాంకుల్లో రెండో స్థానంలో నిలిచాడు. ఇక టెస్టు బౌలింగ్ ర్యాంకుల్లో టాప్ ప్లేస్‌లో ఉన్న జస్ప్రీత్ బుమ్రాకు సమంగా కివీస్ బౌలర్ మ్యాచ్ హెన్రీ వచ్చేశాడు.**

ఆ ఇద్దరూ ఇప్పుడూ టెస్టు బౌలింగ్ ర్యాంక్‌లో సమంగా ఉన్నారు. ఇక వన్డే బ్యాటింగ్‌లో కివీస్ బ్యాటర్ డారెల్ మిచెల్ తొలి స్థానంలో ఉన్నాడు. గిల్, మిచెల్ మధ్య 24 రేటింగ్ పాయింట్స్ తేడా ఉన్నది. ఇటీవల ఆఫ్ఘనిస్తాన్‌తో జరిగిన వన్డే సిరీస్‌లో గిల్ అద్భుతంగా రాణించాడు. దీంతో అతని ర్యాంకు మెరుగుపడింది. ఇక ఆఫ్ఘన్‌తో జరిగిన మూడో వన్డేలో అతనికి బ్యాటింగ్ రాలేదు. ఆ మ్యాచ్‌లో ఇండియా 9 వికెట్ల తేడాతో నెగ్గింది. ఇక రెండు వన్డేల్లో అతను 84, 154 రన్స్ స్కోరు చేశాడు. ఇషాన్ కిషణ్ 21 స్థానాలను దాటి ప్రస్తుతం 43వ ర్యాంక్‌కు చేరుకున్నది. వన్డే బౌలర్లలో అర్షదీప్ సింగ్ 22, ప్రసిద్ధ కృష్ణ 58, వాషింగ్టన్ సుందర్ 71వ స్థానంలో ఉన్నారు. ఆఫ్ఘనిస్థాన్‌తో సిరీస్‌లో ఆడని కోహ్లి ప్రస్తుతం మూడవ స్థానంలో ఉన్నాడు. ఇక రోహిత్ శర్మ నాలుగో స్థానంలో కొనసాగుతున్నాడు. ఇక టెస్టుల్లో కివీస్ బౌలర్ మ్యాట్ హెన్రీ దూసుకొస్తున్నాడు. బుమ్రాతో కలిసి అతను నెంబర్ వన్ స్థానాన్ని ఆక్రమించేశాడు. ఇంగ్లండ్‌తో జరిగిన రెండో టెస్టులో అతను అద్భుతంగా బౌలింగ్ చేశాడు. సుమారు 36 ఏళ్ల తర్వాత మళ్లీ కివీస్ బౌలర్ టాప్ ర్యాంకులో నిలిచాడు. గతంలో జాక్ కోవ్, రిచర్డ్ హాడ్లీ ఆ అగ్రస్థానానికి చేరుకున్నారు. ఇంగ్లండ్‌తో జరిగిన రెండో టెస్టులో మ్యాట్ హెన్రీ 11 వికెట్లు తీసుకున్నాడు.

## వైభవ్ తమ్ముడు దంచుడే దంచుడు

టీమిండియా చిచ్చర పిడుగు వైభవ్ సూర్యవంశీ అంతర్జాతీయ క్రికెట్ మ్యాచ్ ఆడేందుకు సిద్ధమయ్యాడు. ప్రస్తుతం అతడు టీమిండియాతో కలిసి ఐర్లాండ్‌లో ఉన్నాడు. అతడి అంతర్జాతీయ టీ20 అరంగేట్రం ఖరారై పోయిందని సమాచారం. ఈ నేపథ్యంలో వైభవ్ సూర్యవంశీ 2.0 వెలుగులోకి వచ్చాడు. అతడి తమ్ముడు మరో భారీ సెంచరీ చేశాడు. తన తమ్ముడి శతకం గురించి వైభవ్ సూర్యవంశీ సోషల్ మీడియాలో షేర్ చేసిన పోస్టు వైరల్‌గా మారింది. బీహార్‌లోని సమస్తిపూర్ స్థానిక ప్రాక్టీస్ మ్యాచ్‌లో వైభవ్ తమ్ముడు, పదేళ్ల ఆశీర్వాద్ సూర్యవంశీ రిషవ్ ఎలెవన్‌కు ప్రాతినిధ్యం వహించాడు. ఈ మ్యాచ్ లో ఆశీర్వాద్ భారీ శతకం సాధించాడు. వైశాలి ఎలెవన్‌పై 119 బంతుల్లో 19 బౌండరీలు, ఆరు సిక్సర్లు బాది 168 పరుగులు సాధించాడు. ఓపెనర్‌గా దిగిన ఆశీర్వాద్ భారీ ఇన్నింగ్స్ కారణంగా రిషవ్ ఎలెవన్ ఘన విజయం సాధించింది. ఇందుకు సంబంధించిన స్కోరు కార్డును షేర్ చేస్తూ సోదరుడి ప్రదర్శన పట్ల వైభవ్ ఆనందం వ్యక్తం చేశాడు. కాగా ఇటీవలే తేజ్‌పూర్ క్రికెట్ అకాడమీ తరఫున మ్యాచ్ ఆడిన ఆశీర్వాద్ .. 87 బంతుల్లోనే 103 పరుగులు సాధించాడు. స్వల్ప వ్యవధిలోనే ఇలా మరో సెంచరీ సాధించి అందరిని ఆశ్చర్యానికి గురి చేశాడు. కాగా వైభవ్‌కు అన్న ఉజ్వల్, తమ్ముడు ఆశీర్వాద్ ఉన్నారు. వైభవ్ సూర్యవంశీ పన్నెండేళ్లకే రంజీల్లో అరంగేట్రం చేసిన సంగతి తెలిసిందే. అనంతరం పద్నాలుగేళ్లకే రాజస్థాన్ రాయల్స్ తరఫున ఐపీఎల్‌లోనూ అడుగుపెట్టాడు. రాయల్స్ ఓపెనర్‌గా 2025లో 35 బంతుల్లోనే సెంచరీ చేసిన ఈ లెఫ్టాండర్ బ్యాటర్.. 2026లో సంచలన ప్రదర్శనతో ఆరెంజ్ క్యాప్ గెలుచుకున్నాడు.



## రొనాల్డోకు కోపమొచ్చింది!

పోర్చుగల్ స్టార్ ఆటగాడు క్రిస్టియానో రొనాల్డో ఫామ్‌లోకి వచ్చాడు. మొదటి మ్యాచ్‌లో పెద్దగా ప్రభావం చూపించని అతడు.. రెండో మ్యాచ్‌లో ఉజ్బెకిస్థాన్‌పై అదరగొట్టాడు. రెండు గోల్స్ సాధించి మరీ తన జట్టు విజయంలో కీలక పాత్ర పోషించాడు. దీంతో ఆరు వరల్డ్ కప్‌ల్లో గోల్స్ సాధించిన ప్లేయర్‌గా నిలిచాడు. పోర్చుగల్ 5-0 తేడాతో ఉజ్బెకిస్థాన్‌పై గెలిచిన అనంతరం రొనాల్డో ప్రెస్ కాన్ఫరెన్స్‌లో మాట్లాడాడు. అయితే, అక్కడ అతడి ఎదుట అర్జెంటీనా స్టార్ లియోనెల్ మెస్సి గురించి ప్రశ్నలు ఎదురు కావడంతో కాస్త అసహనానికి గురయ్యాడు. ఇప్పుడు ఆ వీడియోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. ప్రెస్ కాన్ఫరెన్స్‌లో ఓ జర్నలిస్ట్ ప్రశ్న అడుగుతూ.. "నిన్న లియోనెల్ మెస్సి రెండు గోల్స్ చేశాడు. ఎంబాపె కూడా.." అని అడిగేలోపే రొనాల్డో తన తలను మరోవైపు తిప్పేశాడు. మరో ప్రశ్న అడగమని వేరే రిపోర్టర్‌కు సూచించాడు. అయితే, "మీరు అడిగే ప్రశ్ననుబట్టి.. నా సమాధానం ఉంటుంది. లేకపోతే లేదు" అని వ్యాఖ్యానించడం వీడియోల్లో రికార్డైంది. టోర్నీలో అర్జెంటీనాతో మ్యాచ్ ఆడాల్సినప్పుడు ఎలా భావిస్తారు? అనే ప్రశ్నకు రొనాల్డో సమాధానం ఇచ్చాడు. "ఇప్పుడు ఆ ప్రశ్నకు సమాధానం ఏం చెప్పాలో తెలియడం లేదు. ఇది అర్థం లేని ప్రశ్న. కానీ, ఆ జట్టుతో మ్యాచ్ అద్భుతంగా ఉంటుంది" అని తెలిపాడు. ప్రెస్ కాన్ఫరెన్స్ ముగించుకొని వెళ్తుండగా, ఓ విలేకరి "మెస్సి హ్యాట్రిక్ కొట్టాడు" అని ప్రస్తావించగా.. "ఇతరుల గురించి నేను పెద్దగా పట్టించుకోను" అని సమాధానం ఇస్తూ వెళ్లిపోయాడు.





# క్రొయేషియా సూపర్ విక్టరీ

**నాకౌట్ ఆశలు సజీవం.. 1-0 తేడాతో పనామా అవుట్**

**ఫిఫా ఫుట్‌బాల్ వరల్డ్ కప్-2026లో భాగంగా గ్రూప్-ఎల్ లో జరిగిన కీలక పోరులో క్రొయేషియా సత్తా చాటింది. భారత కాలమాన ప్రకారం.. బుధవారం టొరంటో స్టేడియం వేదికగా జరిగిన మ్యాచ్‌లో పనామాపై 1-0 తేడాతో ఉత్కంఠ విజయం సాధించింది.**

**ఈ విజయంతో టోర్నీలో తొలి పాయింట్ల (3) ఖాతా తెరిచిన క్రొయేషియా.. తన నాకౌట్ ఆశలను సజీవంగా ఉంచుకుంది. మరోవైపు, వరుసగా రెండో మ్యాచ్‌లోనూ ఓడిన పనామా టోర్నీ నుంచి నిష్క్రమించింది. తొలి భాగంలో ఇరు జట్లు గోల్ చేయలేకపోయాయి.**

54వ నిమిషంలో జోసిప్ స్టానిసిక్ అందించిన చక్కటి పాస్‌ను, సబ్‌స్టిట్యూట్‌గా బరిలోకి దిగిన ఆంటె బుడిమిర్ (ఉాత్వ దీబఒఅఎఅతీ) అద్భుతమైన గోల్‌గా మలిచి క్రొయేషియాకు ఆధిక్యాన్ని అందించాడు. క్రొయేషియా స్టార్ కెప్టెన్ లూకా మోడ్రిచ్‌కు ఇది 200వ అంతర్జాతీయ మ్యాచ్ కావడంతో రికార్డు సాధించాడు. తనకు మైలురాయిగా నిలిచే ఈ మ్యాచ్‌లో జట్టుకు విజయం దక్కడంతో మోడ్రిచ్ ఆనందంతో సంబరాలు చేసుకున్నాడు. మ్యాచ్ మొదటి భాగంలో (23వ నిమిషం), అలాగే రెండో భాగంలో (67వ నిమిషం) పనామా ఆటగాళ్లు చేసిన ప్రమాదకరమైన దాడులను క్రొయేషియా గోల్ కీపర్ డొమినిక్ లివాకోవిచ్ అద్భుతమైన సేవ్స్‌తో అడ్డుకుని జట్టు విజయంలో కీలక పాత్ర పోషించాడు. ప్రస్తుతం గ్రూప్-ఎల్‌లో ఇంగ్లండ్, ఘనా చెరో 4 పాయింట్లతో ఉండగా, క్రొయేషియా 3 పాయింట్లతో ఉంది. శనివారం ఫిలడెల్ఫియాలో పటిష్టమైన ఘనాతో క్రొయేషియా తన ఆఖరి లీగ్ మ్యాచ్ ఆడనుంది. నాకౌట్ చేరాలంటే క్రొయేషియాకు ఈ మ్యాచ్ అత్యంత కీలకం కానుంది. అదే రోజు ఇంగ్లండ్ జట్టు.. పనామాతో తలపడనుంది.




## రో-కో సంగతేంటో తేల్చాలి

టీమిండియా స్టార్ ప్లేయర్లు రోహిత్ శర్మ , విరాట్ కోహ్లీ .. భవితవ్యంపై భారత మాజీ స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్ కీలక వ్యాఖ్యలు చేశాడు. వన్డే ప్రపంచకప్ 2027లో ఆడటమే లక్ష్యంగా రోహిత్, కోహ్లీ అడుగులు వేస్తున్నారు. కానీ వారు ఈ మెగా టోర్నీలో ఆడతారా.. లేదా అనే అంశంపై బీసీసీఐ ఇప్పటివరకు స్పష్టత ఇవ్వడం లేదు. కొందరు.. రోకో ప్రపంచకప్ ఆడరని.. మరికొందరు ఆడాలని కామెంట్లు చేస్తున్నారు. ఇదే విషయంపై అశ్విన్ మాట్లాడాడు. వీరిపై సెలక్టర్లు వీలైనంత త్వరగా నిర్ణయం తీసుకోవాలని సూచించాడు. "ఇటీవల కాలంలో రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ గురించి వస్తున్న వార్తలు బాలేవు. కొందరు పనిగట్టుకుని నెగెటివ్ ప్రచారం చేస్తున్నారు. అసలు ఎక్కడ నుంచి ఇలాంటి నెగెటివ్ ప్రచారం వస్తోందో తెలియడం లేదు. కొందరు మాత్రం ఈ ఇద్దరు ప్రపంచ కప్‌లో ఆడకూడదని గట్టిగా కోరుకుంటున్నారు. ఎందుకు ఇలాంటి ఆలోచన చేస్తున్నారో మాత్రం అర్థం కావడంలేదు. కొందరేమో వారు ఆడకపోవచ్చని అనుమానాలు వచ్చేలా మాట్లాడుతున్నారు. మరికొందరు మాత్రం రో-కో ఉంటేనే బాగుంటుందంటారు. నా వ్యక్తిగత అభిప్రాయం ప్రకారం వన్డే ప్రపంచకప్ 2027లో రోహిత్, కోహ్లీ తప్పకుండా ఆడాలి" అని అశ్విన్ వ్యాఖ్యానించాడు. ఇదే సమయంలో అశ్విన్.. భారత సెలక్టర్లకు కీలక సూచన చేశాడు. "దక్షిణాఫ్రికా వేదికగా జరిగే వన్డే ప్రపంచ కప్‌లో కోహ్లీ, రోహిత్ ఉండాలని మీరు కోరుకుంటే.. ఇప్పుడే నిర్ణయం తీసుకోండి. అలా చేయడం వల్ల టోర్నీ నాటికి వారు పూర్తి సన్నద్ధతతో, విశ్వాసంతో ఉంటారు. ఒకవేళ ఎలాంటి నిర్ణయం తీసుకోకపోతే.. ముమ్ముందు ఈ అంశం మరింత సంక్లిష్టంగా మారుతుంది. గందరగోళానికి దారి తీస్తుంది" అని రవిచంద్రన్ అశ్విన్ తన మనసులోని మాటను బయటపెట్టాడు. రోహిత్, కోహ్లీ టెస్ట్, టీ20లకు రిటైర్మెంట్ ప్రకటించి కేవలం వన్డేలు మాత్రమే ఆడుతున్నారు. రోహిత్ ఇటీవల అఫ్ఘాన్‌తో వన్డే సిరీస్‌లో రాణించాడు. గాయం కారణంగా కోహ్లీ ఈ సిరీస్‌కు దూరమయ్యాడు. వచ్చే నెలలో ఇంగ్లాండ్‌తో జరిగే వన్డే సిరీస్‌లో వీరిద్దరూ పాల్గొనే అవకాశం ఉంది.

## బోణీ కొట్టిన వరంగల్

### హర్షిత్ చౌదరి సెంచరీ

తెలంగాణ టీ20 లీగ్-2026 (టీజీ20)లో మూడో శతకం నమోదైంది. వరంగల్ వారియర్స్ ఓపెనర్ హర్షిత్ చౌదరి శతక్కొట్టాడు. ఖమ్మం ఏసెస్‌తో బుధవారం నాటి మ్యాచ్‌లో 48 బంతుల్లో హర్షిత్ వంద పరుగుల మార్కు అందుకున్నాడు. అతడి శతక ఇన్నింగ్స్‌లో తొమ్మిది ఫోర్లు, ఆరు సిక్సర్లు ఉన్నాయి. కాగా జూన్ 21న టీజీ20 లీగ్ మొదలైన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో వరంగల్ వారియర్స్ కెప్టెన్ అమన్ రావు లీగ్‌లో తొలి సెంచరీ నమోదు చేశాడు. ఉప్పల్ వేదికగా సోమవారం మెదక్ ఫాల్కన్స్‌పై 32 బంతుల్లోనే శతక్కొట్టాడు. తద్వారా లీగ్‌లో మొట్టమొదటి సెంచరీని తన పేరిట లిఖించుకున్నాడు ఈ కరీంనగర్ అబ్బాయి. అయితే, ఆ వెంటనే మెదక్ సారథి తిలక్ వర్మ కూడా సెంచరీ చేసి.. లీగ్‌లో రెండో శతకం నమోదు చేయడంతో పాటు.. వరంగల్‌పై తన జట్టుకు విజయం అందించాడు. తాజాగా తమ రెండో మ్యాచ్‌లో భాగంగా ఖమ్మం ఏసెస్‌ను ఎదుర్కొన్న వరంగల్.. టాస్ గెలిచి తొలుత బౌలింగ్ ఎంచుకుంది. ఈ క్రమంలో బ్యాటింగ్‌కు దిగిన ఖమ్మం 19.2 ఓవర్లలో 202 పరుగులకు ఆలౌట్ అయింది. ఖమ్మం బ్యాటర్లలో మయాంక్ గుప్త (54), మికిల్ జైస్వాల్ (54) అర్ధ శతకాలతో రాణించారు. వరంగల్ బౌలర్లలో మహ్మద్ అబ్దుల్ మాలిక్, అభిషేక్ చెరో మూడు వికెట్లు కూల్చగా.. క్రాంతి పల్లెపాటి రెండు, హుసేన్ ఒక వికెట్ తమ ఖాతాలో వేసుకున్నారు. అనంతరం లక్ష్య ఛేదనకు దిగిన వరంగల్ ఆదిలోనే కెప్టెన్ అమన్‌రావు (7) వికెట్ కోల్పోగా.. మరో ఓపెనర్ హర్షిత్ చౌదరి శతకంతో చెలరేగాడు. మొత్తంగా 62 బంతులు ఎదుర్కొన్న హర్షిత్ పదకొండు ఫోర్లు, ఏడు సిక్సర్ల సాయంతో 121 పరుగులు చేశాడు. మిగిలిన వారిలో రిషికేత్ సిసోడియా (27) మాత్రమే చెప్పుకోదగ్గ స్కోరు చేశాడు. ఇక ఆఖరి వరకు అజేయంగా నిలిచి సిక్సర్‌తో వరంగల్‌ను విజయతీరాలకు చేర్చాడు హర్షిత్ చౌదరి. ఫలితంగా 18.5 ఓవర్లలోనే లక్ష్యాన్ని ఛేదించిన వరంగల్.. ఖమ్మంపై ఐదు వికెట్ల తేడాతో (208-5) విజయం సాధించింది. ఇక సీజన్‌లో వరంగల్‌కు ఇదే తొలి గెలుపు. టీమిండియా స్టార్ మహ్మద్ సిరాజ్ వరంగల్ జట్టుతో పాటు స్టేడియానికి వచ్చినప్పటికీ.. అతడు విశ్రాంతి తీసుకున్నాడు. తదుపరి మ్యాచ్‌లో వరంగల్ తరఫున సిరాజ్ బరిలో దిగనున్నాడు.




నేటి ఈవార్తలు | సంపాదకీయం | Editorial

# ప్రజాస్వామ్యం సెన్సార్ అయిన వేళ..!

భారత ప్రజాస్వామ్య చరిత్రలో జూన్ 25 అనే తేదీ ఒక మలుపు మాత్రమే కాదు, ఒక హెచ్చరిక కూడా. 1975 జూన్ 25 అర్ధరాత్రి దేశవ్యాప్తంగా విధించిన అత్యవసర పరిస్థితి (ఎమర్జెన్సీ) రాజ్యాంగబద్ధ వ్యవస్థలపై, పౌర స్వేచ్ఛలపై, ప్రజాస్వామ్య విలువలపై తీవ్ర ప్రభావం చూపింది. దేశ భద్రత కోసం ఉద్దేశించిన రాజ్యాంగ నిబంధనలను రాజకీయ అవసరాల కోసం వినియోగిస్తే ఎలాంటి పరిణామాలు సంభవిస్తాయో ఈ కాలం స్పష్టంగా చూపించింది. అందుకే జూన్ 25ను కేవలం ఒక చారిత్రక సంఘటనగా కాకుండా, ప్రజాస్వామ్యాన్ని నిరంతరం కాపాడుకోవాల్సిన అవసరాన్ని గుర్తుచేసే రోజుగా చూడాలి. ఎమర్జెన్సీ విధించబడిన వెంటనే దేశవ్యాప్తంగా ప్రాథమిక హక్కుల అమలుపై ఆంక్షలు విధించబడ్డాయి. భావ ప్రకటనా స్వేచ్ఛ, సమావేశాలు నిర్వహించే హక్కు, ప్రభుత్వాన్ని విమర్శించే అవకాశం వంటి ప్రజాస్వామ్యానికి మూలస్తంభాలైన హక్కులు తీవ్రంగా పరిమితమయ్యాయి. పత్రికలపై సెన్సార్ విధించబడింది. ప్రచురణకు ముందే ప్రభుత్వ అనుమతి తీసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. విమర్శనాత్మక కథనాలు, సంపాదకీయాలు నిలిపివేయబడ్డాయి. దీంతో ప్రజలకు స్వతంత్ర సమాచార ప్రవాహం దెబ్బతింది. ఎమర్జెన్సీ కాలంలో వేలాది రాజకీయ నాయకులు, సామాజిక కార్యకర్తలు, విద్యార్థి నాయకులు, ట్రేడ్ యూనియన్ ప్రతినిధులు అరెస్టులకు గురయ్యారు. న్యాయపరమైన విచారణ లేకుండానే నిర్బంధ చట్టాల కింద జైళ్లలో ఉంచబడిన సంఘటనలు అనేకం చోటుచేసుకున్నాయి. అధికారాన్ని ప్రశ్నించిన స్వరాలు అణచివేతకు గురయ్యాయి. ప్రజాస్వామ్యంలో ప్రతిపక్షం పోషించే నిర్మాణాత్మక పాత్ర బలహీనపడింది. ప్రజల తరఫున ప్రశ్నించే వేదికలు మూగబోయాయి. ఎందరో వ్యక్తుల వ్యక్తిగత జీవితాలు ఈ కాలంలో అతలాకుతలమయ్యాయి. అరెస్టుల కారణంగా కుటుంబాలు ఆర్థికంగా, మానసికంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నాయి. ఉద్యోగాలు కోల్పోయిన వారు ఉన్నారు. విద్యార్థుల చదువులు మధ్యలో ఆగిపోయాయి. సామాజిక ఉద్యమాలు నిలిచిపోయాయి. భయభ్రాంతుల వాతావరణంలో ప్రభుత్వ నిర్ణయాలను వ్యతిరేకించే ధైర్యం చాలామందికి లేకుండా పోయింది. ప్రజాస్వామ్యం కేవలం ఎన్నికలతోనే నిలవదని, పౌరుల స్వేచ్ఛలు, విమర్శించే హక్కు, చట్టబద్ధ రక్షణ కూడా అంతే ముఖ్యమని ఈ అనుభవం చాటిచెప్పింది. ఈ కాలంలో మీడియా పాత్రపై కూడా విస్తృత చర్చ జరిగింది. కొంతమంది జర్నలిస్టులు సెన్సార్ ఒత్తిడికి లోనైనా, మరికొందరు స్వేచ్ఛా భావవ్యక్తీకరణ కోసం వివిధ రూపాల్లో ప్రతిఘటించారు. పత్రికా స్వేచ్ఛ అనేది కేవలం మీడియా హక్కు మాత్రమే కాకుండా, ప్రజలకు నిజమైన సమాచారం తెలుసుకునే హక్కు అనే అవగాహన మరింత బలపడింది. ఎమర్జెన్సీ అనంతరం భారత జర్నలిజంలో సంపాదకీయ స్వాతంత్ర్యం, రాజ్యాంగ పరిరక్షణల ప్రాధాన్యం గురించి విస్తృత చర్చలు జరిగాయి. న్యాయవ్యవస్థ, శాసన వ్యవస్థ, కార్యనిర్వాహక వ్యవస్థల మధ్య సమతుల్యత ఎంత అవసరమో కూడా ఈ కాలం తెలియజేసింది. ఏ ఒక్క సంస్థకైనా అపరిమిత అధికారాలు లభిస్తే ప్రజాస్వామ్యానికి ప్రమాదం ఏర్పడే అవకాశం ఉందనే పాఠం చరిత్ర నేర్పింది. రాజ్యాంగ సంస్థల స్వతంత్రత, అధికార విభజన, పౌర హక్కుల పరిరక్షణ ప్రజాస్వామ్యానికి రక్షణ కవచాలుగా నిలుస్తాయని స్పష్టమైంది. అయితే ఎమర్జెన్సీ చరిత్రను కేవలం రాజకీయ విభేదాల కోణంలో మాత్రమే చూడడం సరిపోదు. అది ప్రజాస్వామ్య వ్యవస్థల బలహీనతలను గుర్తించి వాటిని సరిదిద్దుకోవాల్సిన అవసరాన్ని సూచించే ఘట్టం. అధికారంలో ఎవరు ఉన్నారన్నది పక్కనపెడితే, రాజ్యాంగ విలువలకు కట్టుబడి ఉండటం, విమర్శలను సహించగల రాజకీయ సంస్కృతి పెంపొందించడం, పౌర హక్కులను గౌరవించడం ప్రతి ప్రభుత్వ బాధ్యత. ఇప్పటి తరం కోసం ఎమర్జెన్సీ ఒక చరిత్ర పాఠం మాత్రమే కాదు; ప్రజాస్వామ్య పరిరక్షణకు నిరంతర అప్రమత్తత అవసరమనే సందేశం. స్వేచ్ఛ ఒకసారి కోల్పోతే తిరిగి సాధించడం ఎంత కష్టమో ఆ కాలం అనుభవించిన తరాలు చెప్పిన కథలు గుర్తుచేస్తాయి. ప్రజాస్వామ్య వ్యవస్థలు బలంగా ఉండాలంటే స్వతంత్ర మీడియా, చురుకైన న్యాయవ్యవస్థ, బాధ్యతాయుతమైన పాలన, అప్రమత్తమైన పౌర సమాజం కలిసి పనిచేయాలి. జూన్ 25ను ప్రతి ఏడాది స్మరించుకోవడం వెనుక ఉద్దేశం గతాన్ని నిందించడం కాదు; భవిష్యత్తును అప్రమత్తంగా నిర్మించుకోవడం. ప్రజాస్వామ్యం కాగితంపై రాసిన రాజ్యాంగ నిబంధనల వల్ల మాత్రమే నిలబడదు. ప్రజల చైతన్యం, సంస్థల స్వతంత్రత, అధికారంపై నిరంతర ప్రజా పర్యవేక్షణ వల్లే అది సజీవంగా ఉంటుంది. ఎమర్జెన్సీ ఎందరో జీవితాలను ప్రభావితం చేసింది, అనేక కుటుంబాల ఆశలను దెబ్బతీసింది, ప్రజాస్వామ్య విలువలను పరీక్షించింది. ఆ చరిత్ర పునరావృతం కాకుండా చూడడం నేటి తరానికి ఉన్న సామూహిక బాధ్యత.

# రాజ్యాంగం.. నిత్య జీవన వాహిని

(ప్రజాస్వామ్యం వర్ధిల్లాలి: స్వేచ్ఛా స్మరణ నేడు సందర్భోచితం)




**ఎమర్జెన్సీ (అత్యవసర పరిస్థితి)కి ఐదు దశాబ్దాలు నిండాయి. భారత ప్రజాస్వామ్య చరిత్రలో అదొక అత్యంత చీకటి అధ్యాయంగా నిలిచిపోయింది. నాటి దురాగతాలతో తీవ్రంగా గాయపడిన దేశం ఇప్పటికీ ఆ చేదు జ్ఞాపకాలను స్మరించుకుంటూనే ఉంది. ఈ నేపథ్యంలో నేడు 'రాజ్యాంగ హత్యా దినం' జాతీయ సంస్మరణ కార్యక్రమం ముగింపు సందర్భంగా 'ప్రజాస్వామ్యం వర్ధిల్లాలి' అనే నినాదంతో స్వేచ్ఛను స్మరించుకోవడం నిస్సందేహంగా సందర్భోచితం. ఇది చరిత్రను గుర్తుకు తెచ్చుకోవడం మాత్రమే కాదు... మన గణతంత్రాన్ని సగర్వంగా నిలిపిన శాశ్వత విలువలను మననం చేసుకోవడం కూడా అవుతుంది. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఒకానొక సందర్భంలో– "రాజ్యాంగమంటే ఒక న్యాయవాది చేతిలో రూపుదిద్దుకున్న పత్రం కాదు.. అదొక నిత్యజీవన వాహిని.. దాని ఆత్మ సర్వకాలాల్లోనూ జన చైతన్య స్వరూపమే" అని వ్యాఖ్యానించారు. ఇన్నేళ్ల మన రాజ్యాంగ ప్రస్థాన అంతఃసారాన్ని ఈ వ్యాఖ్యలను మించి అభివర్ణించగల మాటలు దొరకడం దుర్లభం. రాజ్యాంగమంటే దేశ పాలన వ్యవహారాలను నియంత్రించే ఒక చట్టబద్ధ చట్రానికి పరిమితం కాదు. స్వేచ్ఛ–జవాబుదారీతనం, పౌరులు–వ్యవస్థలు, హక్కులు–బాధ్యతలు తదితరాల మధ్య అదొక అవినాభావ, నిత్యనూతన ఒప్పందం.**



గజేంద్ర సింగ్ షెఖావత్
కేంద్ర సాంస్కృతిక-పర్యాటక శాఖ మంత్రి

మన నాగరిక సంప్రదాయాలలో భారత ప్రజాస్వామ్య స్ఫూర్తి లోతుగా వేళ్లూనుకున్నది. మన సమాజం అనేక శతాబ్దాలుగా సంప్రదింపులు, సామూహిక చర్చలు, ప్రజా భాగస్వామ్యం వంటి సంస్థాగత సంప్రదాయాలను కొనసాగిస్తోంది. భారత ప్రజాస్వామ్యం వారసత్వం కాదు... అది ఈ నేల విలువలతో నిత్యపోషితమై ఎదుగుతూ వచ్చిందనే వాస్తవం అవిస్మరణీయం. ప్రాచీన జన సభలు–సమితుల నుంచి స్వాతంత్ర్యానంతర పార్లమెంటరీ వ్యవస్థ వరకూ మనం సదా ప్రజల సమష్టి సంకల్పాన్ని విశ్వసిస్తున్నాం. అనూచానంగా మనకు మార్గనిర్దేశం చేసిన విలువలను కాపాడుకుంటూ, ప్రాచీన సంప్రదాయాలన్నింటినీ పోతపోసి, ఒక ఆధునిక ప్రజాస్వామ్య చట్రంగా మార్చింది మన రాజ్యాంగమే. దీని పీఠిక మనకు రాజ్యాంగ దిక్సూచి కాగా, "న్యాయం.. స్వేచ్ఛ.. సమానత్వం.. సౌభ్రాత్రం" రాజ్యాంగ నిర్దేశిత ఆదర్శాలు మాత్రమే కాదు.. అవన్నీ ప్రభుత్వ విధానాలకు కరదీపికల వంటి జాతి ఆకాంక్షలు. వ్యవస్థలను తీర్చిదిద్దుతూ, దేశం–పౌరుల మధ్య అనుబంధాన్ని నిర్వచిస్తాయి. అదే సమయంలో ప్రజాస్వామ్యాన్ని ఎన్నడూ చులకన చేయరాదని కూడా చరిత్ర మనకు ప్రబోధిస్తుంది. స్వతంత్ర భారతానికి ఎదురైన అత్యంత కఠిన పరీక్షల్లో 1975–77 నాటి ఎమర్జెన్సీ ఒకటి. రాజ్యాంగ రక్షణకు తూట్లు పొడుస్తూ, పౌర స్వేచ్ఛకు సంకెళ్లు తగిలిస్తే ప్రజాస్వామ్య వ్యవస్థలు ఎలా పెనుభారంతో తల్లడిల్లుతాయో ఆ కాలం నిరూపించింది. నాడు ఆ ప్రభావం రాజకీయ రంగానికి పరిమితం కాలేదు సరికదా... అది దేశంలోని సామాన్య పౌరుల దైనందిన జీవితాలనూ కుదిపేసింది. అసంఖ్యాక ప్రజానీకం జీవితాలను బలిగొని, అపార మానవీయ నష్టానికి గుర్తుగా మిగిలిపోయింది. రాజ్యాంగ హక్కులు పుస్తకాల్లో రాసుకున్న చట్ట నిర్దేశాలకు పరిమితం కాదని.. అవి పౌరుల ఆత్మగౌరవాన్ని కాపాడే, స్వేచ్ఛ పరిరక్షించే దైనందిన జీవితాలను ప్రత్యక్షంగా ప్రభావితం చేసే రక్షణ కవచాలని నాటి చేదు అనుభవాలు మనకు బలంగా గుర్తుచేస్తున్నాయి. ఈ హక్కులకు దిక్కులేకుండా పోతే వ్యవస్థలు మాత్రమేగాక సామాన్య ప్రజానీకం, వారి కుటుంబాలు సహా యావత్ సామాజిక స్వేచ్ఛ, ఆకాంక్షలపై దుష్ప్రభావం తీవ్ర స్థాయిలో ఉంటుంది. అయితే, కాలం ఇన్ని ఉత్పాతాలను తట్టుకుంటూ– మన ప్రజాస్వామ్యానికిగల అసమాన పునరుత్థాన సామర్థ్యాన్ని ఘనంగా చాటింది. దేశ ప్రజలు కూడా రాజ్యాంగ విధినిర్దేశాలపై అసాధారణ విశ్వాసం ప్రదర్శించడంతో ప్రజాస్వామ్య ప్రక్రియలు చివరకు అన్నిరకాల వక్రీకరణలను సరిదిద్దాయి. శాంతియుత భాగస్వామ్యం, బ్యాలెట్ పెట్టెల ద్వారా సార్వభౌమాధికారం ప్రజలదేననే వాస్తవాన్ని పౌరులు శక్తిమంతంగా పునరుద్ఘాటించారు. సవాళ్లతో కూడిన పరిస్థితుల నడుమ గుణపాఠాలు నేర్వడం, తదనుగుణంగా వ్యవహరించడం, స్వీయ దిద్దుబాటు, మరింత శక్తిని పుంజుకోవడం వంటివే భారత ప్రజాస్వామ్య సామర్థ్యానికి నిదర్శనాలు.

ఈ సంస్మరణ కార్యక్రమంలో భాగంగా ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ప్రదర్శన అందర్నీ ఆకట్టుకుంది. భారత ప్రజాస్వామ్య చరిత్రలో అత్యంత కఠిన పరీక్షగా నిలిచిన ఒక కాలంలోని సాదృశ యాత్రగా ఇది దుస్సహ సంఘటనలను గుర్తుచేసింది. ఈ ప్రదర్శనలోని చారిత్రక పత్రాలు, ప్రతిఘటన గాథలు, రాజ్యాంగ విజయాలు, ఎమర్జెన్సీ నాటి ప్రజల బాధల గాథలు ప్రదర్శితమయ్యాయి. ఈ సందర్భంగా పద్మభూషణ్ పురస్కార గ్రహీత, ప్రముఖ పాత్రికేయుడు, రచయిత శ్రీ రామ్ బహదూర్ రాయ్ ప్రత్యేక స్మారకోపన్యాసం చేశారు. 'రాజ్యాంగ అప్రమత్తత–ప్రజాస్వామ్య పునరుద్ధరణ' అనే విస్తృత ఇతివృత్తానికి ఈ ప్రసంగం సమకాలీన ఔచిత్యాన్ని జోడించింది. స్వాతంత్ర్యం వచ్చి దాదాపు ఎనిమిది దశాబ్దాలు పూర్తవుతున్న నేటి పరిస్థితుల్లో ప్రజాస్వామ్యానికి అర్థం నిరంతరం పరిణామశీలం అవుతూనే ఉంది. నేటి పౌరులు ప్రాతినిధ్యాన్ని మాత్రమేగాక మరింత భాగస్వామ్యాన్ని కూడా ఆకాంక్షిస్తున్నారు. హక్కులతోపాటు బాధ్యతాయుత పాలనను అభిలషిస్తున్నారు. ఆర్థిక సార్వజనీనత, క్షేత్రస్థాయి భాగస్వామ్యం, పౌరకేంద్రక పాలనను ప్రోత్సహించే కార్యక్రమాలు వంటివి ప్రజాస్వామ్య వ్యవస్థల పరిధిని విస్తృతం చేశాయి. అదే సమయంలో పౌర కర్తవ్యం కూడా మరింత ప్రాధాన్యం సంతరించుకుంది. విజ్ఞానవంతులైన పౌరుల ద్వారానే బలమైన ప్రజాస్వామ్య మనుగడ ఆధారపడి ఉంటుంది. ప్రపంచం నేడు భారత్‌ను "ప్రజాస్వామ్యానికి పుట్టినిల్లు"గా పరిగణిస్తున్నారంటే– అది ప్రాచీన రాజధర్మం నుంచి ఆధునిక ఓటర్ల సంకల్పం దాకా మన సుదీర్ఘ నాగరిక ప్రస్థానానికి సముచిత గుర్తింపు. ఈ ముగింపు కార్యక్రమంలోని ప్రతి ఘట్టం... ప్రజాస్వామ్యాన్ని ఒక సజీవ, పరిణామశీల జాతీయ అనుభవంగా చాటిచెబుతుంది. 'స్వాతంత్ర అమృత మహోత్సవాల్లో' భాగంగా 2021లో ప్రారంభించిన అద్భుత, వినూత్న ఆవిష్కరణ– 'జిల్లా డిజిటల్ భాండాగారం' (డిజిటల్ డిస్ట్రిక్ట్ రిపోజిటరీ). దేశం నలుమూలల నుంచి వందలాది అజ్ఞాత త్యాగధనుల, ధీరుల వీరగాథలను, ప్రజా భాగస్వామ్య స్ఫూర్తిని ప్రపంచానికి పరిచయం చేయడమే ఈ ప్రదర్శన ప్రధానోద్దేశం. మన స్వాతంత్ర్య సంగ్రామంలోని ఇలాంటి వీరుల వృత్తాంతాలపై కేంద్ర సాంస్కృతిక మంత్రిత్వ శాఖ 10 లఘు చిత్రాలను కూడా రూపొందించింది. సాంస్కృతిక స్మృతులు, చారిత్రక అవగాహన, ప్రగాఢ జాతీయ భావనలతో రాజ్యాంగ విలువలు బలోపేతమైతేనే ప్రజాస్వామ్యం మరింత పటిష్టం కాగలదని ఈ కార్యక్రమాలు మనకు గుర్తుచేస్తాయి. ఇప్పటిదాకా ఈ ప్రత్యేక వెబ్‌సైట్ విభాగంలో 19,500కు పైగా చారిత్రక కథనాలను 'డీడీఆర్' పొందుపరిచింది. ఈ కార్యక్రమానికి సహకరించిన సంస్థలు, విభాగాలలో సాంస్కృతిక మంత్రిత్వ శాఖ పరిధిలోని స్వయంప్రతిపత్త 'సెంటర్ ఫర్ కల్చరల్ రిసోర్సెస్ అండ్ ట్రైనింగ్' (సీసీఆర్‌టీ) ఒకటి. భారత స్వాతంత్ర్య పోరాటంలో నిగూఢ కోణాలను వెలుగులోకి తెస్తూ గణనీయ సంఖ్యలో గాథలను నమోదు చేసి, భద్రపరచింది. ఈ శుభ సందర్భాన సాహసానికి, త్యాగానికి, నిరంతర సేవకు సజీవ సాక్ష్యాలుగా నిలిచిన ఇద్దరు వృద్ధ స్వాతంత్ర్య సమరయోధులు మన మధ్య ఉండటం మనకెంతో గర్వకారణం. వారిలో ఒకరు మహారాష్ట్ర వాస్తవ్యులైన శ్రీ శేషారావు లక్ష్మణ్‌రావు ఖోట్, ఈయన విద్యార్థి దశలోనే హైదరాబాద్ విముక్తి పోరాటంలో భాగస్వామి అయ్యారు. మరొకరు ఆంధ్రప్రదేశ్ నివాసి శ్రీ ఎద్దుల సూర్యనారాయణ రెడ్డి. అల్లసాని పెద్దన ప్రసిద్ధ చాటువు 'అచట పుట్టిన చిగురు కొమ్మైన చేవ' అన్నట్లు ఈయన బాల్యంలోనే స్వాతంత్ర్య ఉద్యమంలో దూకారు. కేవలం పదకొండేళ్ల పసిప్రాయంలోనే పోలీసు నిర్బంధాన్ని ఎదుర్కొన్నారు. స్వాతంత్ర్య పోరాటమంటే ఏనాడో ముగిసిన సుదూర చరిత్ర కాదని, కట్టెదుట కదలాడే సజీవ జ్ఞాపకమని ఈ ఇద్దరు యోధుల ఉనికి మన వెన్నుతట్టి గుర్తుచేస్తోంది.

## వారసత్వం.. సంస్కృతుల సజీవ స్రవంతి

పరస్పర సంప్రదింపులు, వైవిధ్యం, సామాజిక సమైక్యతను అనాదిగా పెంచిపోషించిన సాంస్కృతిక సంప్రదాయాలు, కళాత్మక వ్యక్తీకరణలు, ఉమ్మడి వారసత్వ వైభవాన్ని చాటే "విరాసత్ 11వ ఉత్సవం" ఈ కార్యక్రమానికి ప్రత్యేక శోభనిచ్చింది. స్వాతంత్ర్య సమర యోధురాలు, వివిధ వ్యవస్థల రూపకర్త, సాంస్కృతిక దార్శనికురాలైన కమలాదేవి చటోపాధ్యాయ స్మృతిని ఈ వేడుక ప్రతిబింబించింది. తరాలు, ప్రాంతాలు, ఆలోచనా విధానాల మధ్య శతాబ్దాల తరబడి సాగిన పరస్పర సంబంధాలతో పరిణామం చెందిన సంగీత సంప్రదాయాల నుంచి ఈ ప్రాచీనాంశాల ప్రదర్శన ప్రేరణ పొందింది. వైవిధ్యం, క్రమశిక్షణ, సృజనాత్మక స్వేచ్ఛ వంటి విలువలకు భారత శాస్త్రీయ సంగీత వారసత్వం కొనసాగింపు ఒక నిలువెత్తు నిదర్శనం. ఈ విలువలు శక్తియుత ప్రజాస్వామ్యానికీ అంతే అవసరం. అస్సాం సహా ఈశాన్య భారత సుసంపన్న సాంస్కృతిక సంప్రదాయాలను 'ఎనజోరి: లోక్‌నాద్ – జనజాతీయ సమరసతా కా స్వర్–సంగం' ప్రదర్శన కళ్లకు కట్టింది. విభిన్న సమాజాల సంగీత–నృత్య రీతులతో మన గణతంత్ర రాజ్య మూల సూత్రాలలో ఒకటైన 'భిన్నత్వంలో ఏకత్వం' భావనను సుందరంగా చూపింది. అనేక అస్తిత్వాలను ఐక్యం చేసుకోగల సామర్థ్యమే భారత్ బలం అనే వాస్తవాన్ని ఇది మనకు గుర్తుచేస్తుంది. అన్నిటినీ మించి, "నిశ్శబ్దం నుంచి స్వరం వైపు.. చీకటి నుంచి వెలుగు దిశగా" ఇతివృత్తంతో 'సీసీఆర్‌టీ' పరిశోధకులు ఇచ్చిన ప్రత్యేక ప్రదర్శన ఎంతగానో ఆకట్టుకుంది. భారత శాస్త్రీయ సంగీత భాషతో భయం, అణచివేత నుంచి ధైర్యం, నవ్యోత్తేజం, ప్రజాస్వామ్య పునరుత్థానం దిశగా సాగిన ప్రస్థానాన్ని ఈ ప్రదర్శన అద్భుతంగా ఆవిష్కరించింది. మహర్షి దయానంద సరస్వతి 'కళా గురుకుల అండ్ కళాగ్రామ్'కు శంకుస్థాపన చేయడం. ఈ స్మారకోత్సవంలో మరో కీలక ఘట్టం. భారతీయ కళా వారసత్వంపై అధ్యయనం, సంగీతాభ్యాసం లక్ష్యంగా దీనికి రూపుదిద్దారు. మన ప్రాచీన సంప్రదాయ గురుకుల వ్యవస్థ స్ఫూర్తితో ఈ కేంద్రాన్ని నిర్మిస్తారు. ప్రజాస్వామ్య విలువలను భావి తరాలకు సంక్రమింపజేయడానికి, సాంస్కృతిక సంప్రదాయాల నిరంతరం సంరక్షణ, నూతనోత్తేజం దిశగా కృషిలో ఇటువంటి సంస్థల పాత్ర అవిభాజ్యం. ఈ సూత్రానికి అనుగుణంగా ప్రజల చైతన్యాన్ని, పౌర స్ఫూర్తిని సాంస్కృతిక అభివ్యక్తి నేటికీ ఎంతగా ప్రభావితం చేయగలదో 'సేవా పర్వ్' నిరూపించింది. ఈ 'రాజ్యాంగ హత్యా దినం' సంస్మరణ కార్యక్రమంలోని ప్రతి ఒక్క ఘట్టం అంతిమంగా ఓ సామూహిక సందేశాన్నిచ్చాయి. ఆ మేరకు ప్రజాస్వామ్యం ఒక రాజకీయ వ్యవస్థకు పరిమితం కాదని, అది మన సజీవ సంప్రదాయమని గుర్తుచేశాయి. అది ప్రజల భాగస్వామ్యంతోనే దాని మనుగడ సజావుగా, చిరస్థాయిగా సాగుతుంది. నిరంతర అప్రమత్తత, చైతన్యం గల పౌరులే దాని రక్షకులు. దేశం 2047లో స్వాతంత్ర్య శతాబ్ది వేడుకల దిశగా పయనిస్తున్న తరుణంలో సరికొత్త సంకల్పంతో ఈ స్ఫూర్తిని కొనసాగించేందుకు మనమంతా ప్రతినబూనుదాం!

This newspaper is Owned and Published by **BOMMAKANTI SHRAVAN KUMAR** from H.No.4-36, Balwanthapoor, Mallial, Jagitial District, Telangana, 505452, Phone Number: 9440455811. Edited by **BOMMAKANTI SHRAVAN KUMAR** and Printed by M/s Kakatiya Printers at #2-24-96/9, Near Sri Krishna Pharma, Laxminarayana Nagar, Ida Uppal, Medchal Malkajgiri District, Telangana, 500039. PRGI REGD No.: TGTEL/25/A1385 . Corporate Office: #1-5-431/20/4, GS Pride, Plot No.4, Jonnabanda, Old Alwal, Medchal Malkajgiri District, Telangana, 500010. Landline: 040-35673004.